WORLD SAREE DAY



శారీలేరు నీకెవ్వరూ..

8వ పేజీలో

భారతీయ సంస్కృతికీ, కళాత్మకతకూ చిహ్నం చీర. స్త్రీ నిండుదనానికి అద్దంపట్టే వస్త్రధారణ ఇది. చీరదేముంది.. ఒంటికి చుట్టేసుకోవడమే కదా అనుకుంటారు గానీ ప్రాంతానికో తీరుగా ఉండే చీరకట్టు ఆ ప్రాంతపు అస్తిత్వాన్ని పట్టి చూపుతుంది.. మిడ్డీలూ, అరచెడ్డీలూ, చింపుడు ప్యాంట్లూ, నిలువు గౌన్లూ.. ఇలా పడమటి గాలి ఎన్ని ఫ్యాషన్లు మోసుకొచ్చినా.. మన చీర మాత్రం చెక్కుచెదరని అందానికి ప్రతీకగా నిలిచే ఉంది. అందుకే చీరకీ ఏడాదికో పండుగదినాన్ని నిర్ణయించారు. అది ఈరోజే! దేశ ఫ్యాషన్ పటంపై ఎగురుతున్న మనజిల్లా చీరల విశేషాలు..



తిరుమలలో అఖిల్

తిరుమల శ్రీవారిని శుక్రవారం ఉదయం దర్శించుకుని వస్తున్న సినీహీరో అక్కినేని అఖిల్

- తిరుమల, ఆంధ్రజ్యోతి

...అయినా ఇసుక ఆగలేదు

వైసీపీ ప్రభుత్వం పోయింది. 'కూటమి' అధికారంలోకి వచ్చింది. అయినా.. ఇసుక అక్రమ రవాణా ఆగలేదు. గత ప్రభుత్వంలో స్థానికులను బెదిరించి.. దౌర్జన్యంగా ఇసుక తరలించిన వారే ఇప్పుడూ కీలక పాత్ర పోషిస్తున్నారు. అధికార యంత్రాంగం చూసీచూడనట్లు ఉంటోంది.

- చిట్టమూరు, ఆంధ్రజ్యోతి



ఇసుక లోడ్‌తో తడకు బయలుదేరుతున్న ట్రాక్టర్లు

- మెట్టు స్వర్ణముఖి నది నుంచి భారీగా తరలింపు
- వైసీపీ కనుసన్నలలో అక్రమ రవాణా
- పట్టించుకోని అధికార యంత్రాంగం

చిట్టమూరు మండలం మెట్టు స్వర్ణముఖి నది నుంచి ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. కొందరు అధికారులకు, ఇసుకాసురులకు ఆదాయ వనరుగా మారింది. నిత్యం తడ, ఆరంబాకం నుంచి ట్రాక్టర్లు వరుసపెట్టి ఇసుక దోచుకపోతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. ఓ వైసీపీ బడా నాయకుడి కనుసన్నల్లో గ్రామాన్ని గుప్పెట్లో పెట్టుకొని ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలతో ఇసుక లోడ్ చేసేందుకు వంతుల ఆశ కల్పించి ఈ వ్యవహారాన్ని నడిపిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఇటీవల ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేసేందుకు మెట్టు స్వర్ణముఖి నదిలోకి వెళ్లే దారులకు అధికారులు గోతులు తీయించారు. వాటిని పూడ్చేసి మళ్లీ ఇసుక రవాణాకు శ్రీకారం చుట్టారు. ప్రతి రోజు తడ, ఆరంబాకం ప్రాంతాల నుంచి మెట్టు స్వర్ణముఖి నదికి ట్రాక్టర్లు వస్తున్నాయి. మెట్టు ప్రాంతాలకు చెందిన ట్రాక్టర్లు నదిలోకి వెళ్లి ఇసుక లోడ్ చేసుకొని ఊరి బయట వచ్చి ట్రక్కులు మార్చుకొని ఇసుక రవాణా సాగిస్తున్నారు. మెట్టు గ్రామంలోనే విశాలమైన ప్రాంతలో ఇసుక నిల్వ చేసి తడ ప్రాంతాలకు తరలిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రజలు ఇసుకకు పడిన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి ప్రభుత్వం ఉచిత విధానాన్ని తీసుకొచ్చింది. బయట ప్రాంతాలకు ఇసుక తరలించకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టంచేసింది. అయినా అధికారులు క్షేత్రస్థాయిలో పట్టించుకోవడం లేదు. అందుకే అక్రమ రవాణా ఆగడంలేదు.

వ్యతిరేకత వచ్చే అవకాశం

'అయ్యా మా నదిలో ఇసుకెత్తద్దు. నీటి వనరులు పడిపోతాయ్' అంటూ స్థానికులు కోరినా వైసీపీ ప్రభుత్వంలోని ఇసుకాసురులు కనికరించలేదు. అడ్డుకుంటే పోలీసు కేసులు పెట్టించారు. దౌర్జన్యంగా ఇసుక తరలించారు. పార్టీలకతీతంగా ఇక్కడి రైతులు, ప్రజలు కోర్టులను ఆశ్రయించారు. అయినా, అధికారుల సహకారంతో తప్పుడు సమాచారం ఇచ్చి ఇసుకాసురులు లైన్‌క్లియర్ చేసుకున్నారన్న ఆరోపణలున్నాయి. దీంతో వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఎన్నికల నాటికి అది బయటపడింది. ఇప్పుడూ, నాటి ఇసుకాసురులు అక్రమ రవాణా కొనసాగిస్తుంటే.. ఆ వ్యతిరేకత సెగ కూటమి ప్రభుత్వానికీ తగలుతుంది.



మెట్టు స్వర్ణముఖి నదిలో ట్రాక్టర్లకు ఇసుక లోడ్ చేయిస్తున్న వైసీపీ అనుచరుడు

ఇసుక డంప్ స్వాధీనం

రేణిగుంట, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం గాజులమండ్యం రజక కాలనీ సమీపంలో ఇసుక డంప్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇక్కడ డంప్ చేసిన ఇసుక రాత్రివేళ టిప్పర్ల ద్వారా బయట ప్రాంతాలకు తరలించేవారు. దీనిపై రెవెన్యూ అధికారుల సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. 20 ట్రక్కుల ఇసుక డంప్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా శుక్రవారం సాయంత్రం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను గాజులమండ్యం పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

'రియల్ వెంచర్'లోనూ ఇసుక గుట్టలు

తిరుపతిరూరల్, డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండలంలో గ్రామాలకు సమీపంలోని స్వర్ణముఖినది, వాగుల్లోంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుక తీసుకొచ్చి ముళ్ల పొదలు, ఖాళీ రియల్‌వెంచర్లలో డంపు చేస్తున్నారు. అక్కడ్నుంచి అమ్మకాలు.. బయట ప్రాంతాలకు తరలిస్తున్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇదేతరహాలో పలువురు అక్రమంగా ఇసుకని అక్రమంగా తరలించారు. ఇప్పుడూ ఈ ఇసుక రవాణా ఆగలేదు. గొల్లపల్లె, పైడిపల్లెగ్రామాల్లో పలుచోట్ల ముళ్లపొదలు, రియల్‌ఎస్టేట్ వెంచర్లలో ఇసుక డంపులున్నాయని గ్రామస్తులు అంటున్నారు. పైడిపల్లెలోని రియల్ వెంచర్‌లో మామిడిచెట్లుల మాటున పలుచోట్ల ఇసుక నిల్వలు ఉంచారు. గాంధీపురం పంచాయతీలోని ప్రభుత్వస్థలంలో ఇసుక నిల్వకేంద్రాన్ని ఏర్పాటు చేసి విక్రయాలు చేపడుతున్నా యంత్రాంగం పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.



పైడిరెడ్డిపల్లె వద్ద..

ఈరోజు 16 గంటల రాత్రి

తిరుపతిరూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఈ రోజు (డిసెంబరు 21వ తేది) 16 గంటలపాటు రాత్రి ఉంటుంది. సూర్యుడికి అత్యంతదూరంలో భూమి ఉండడం, దక్షిణధ్రువం వద్ద 23.4 డిగ్రీలు వంగి ఉండడం కారణంగా దీన్ని శీతాకాల ఆయనాంతమని (వింటర్ సొలిస్టిక్) అంటారు. మన దేశంతో పాటు ఐస్‌లాండ్, అలాస్కా, నార్వేలలో ఈరోజు ఒక అద్భుతం చూడనున్నామని తిరుపతి జిల్లా సైన్సు అధికారి భానుప్రసాద్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. దీనివల్ల శనివారం ఏకంగా రాత్రిసమయం (మబ్బులతో కూడిన చీకటి) 16గంటలు, సూర్యకాంతి కేవలం 8గంటలే ఉంటుందన్నారు. ప్రత్యేకించి చంద్రుడి కాంతి భూమిపై 16గంటలు ఉండడం వల్ల దీన్ని సుదీర్ఘరాత్రి అని అంటామన్నారు. 'సూర్యుడి కిరణాలు భూమిని చేరడానికి ఎక్కువ సమయం పట్టడం దీనికి మరోకారణం. ఏటా రెండుసార్లు వేసవి, శీతాకాల ఆయనాంతాలు వస్తాయి. ఏటా ఇలా 16గంటల సుదీర్ఘరాత్రి ఉండదు. ఈ శీతాకాల ఆయనాంతంలో పలు ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలు జరుపుకొంటారు. ఉత్తరభారతదేశంలో శ్రీకృష్ణుడుకి నైవేద్యం సమర్పించి గీతాపారాయణం చేస్తారు. రాజస్థాన్‌లో పండుగని నిర్వహిస్తారు. సూర్యుడు ఉత్తరాన ప్రక్రియ శీతాకాలం నుంచి మొదలవుతుంది' అని వివరించారు.

ఇసుక అక్రమ తవ్వకాలపై దాడులు

చంద్రగిరి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం శానంబట్ల సమీపంలో శివగిరి వద్ద స్వర్ణముఖి నదిలో ఇసుక అక్రమ తరలింపుపై శుక్రవారం మైనింగ్, పోలీస్, రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించారు. హిటాచీ, టిప్పర్, మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు మైనింగ్ ఏజీ వీరేష్ తెలిపారు. ఈ వాహనాలను పోలీసులకు అప్పగించారు. పోలీసులు స్వర్ణముఖి నదిలో దాడులు నిర్వహించి మూడు ట్రాక్టర్లను సీజ్ చేశారు.



మైనింగ్ అధికారులు సీజ్ చేసిన టిప్పర్, ట్రాక్టర్లు



మైనింగ్ అధికారులు సీజ్ చేసిన హిటాచీ

నా పేరు చెబితే అరెస్టు చేయండి

రేణిగుంట, ఆంధ్రజ్యోతి: ఇసుక అక్రమ రవాణాలో ఎవరైనా తన పేరు చెబితే వెంటనే అరెస్టు చేయాలని అధికారులను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆదేశించారు. రేణిగుంట మండలం అన్నాసామిపల్లెలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన ఇసుక అక్రమ రవాణాపై తీవ్రంగా స్పందించారు. తన పేరు చెప్పినా వదిలిపెట్టొద్దని, చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు.

రోడ్లపై గుంతలకు మరమ్మతులు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

తిరుమల, డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): తిరుమలలో రోడ్లపై ఏర్పడిన గుంతలకు టీటీడీ తాత్కాలిక మరమ్మతులు చేపట్టింది. ఇటీవల కురిసిన వర్షాలకు ఘాట్లతో పాటు తిరుమలలోని రోడ్లపైనా గుంతలు ఏర్పడ్డాయి. వీటివల్ల శ్రీవారి దర్శనార్థం వచ్చే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారంటూ 'ఈ గుంతలేంటి గోవిందా..!' శీర్షికన ఆంధ్రజ్యోతిలో శుక్రవారం కథనం ప్రచురితమైంది. ఈక్రమంలో టీటీడీ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ఇంజినీరింగ్ అధికారులు శుక్రవారం గుంతలకు తాత్కాలిక మరమ్మతులు చేశారు. రానున్న నెలరోజుల్లో పూర్తిస్థాయిలో రోడ్లపై గుంతలు లేకుండా చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు.



మరమ్మతుల అనంతరం హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద రోడ్డు

రెవెన్యూ సదస్సులకు 728 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్న సదస్సుల్లో రెవెన్యూ, భూసమస్యలను సులభతరంగా పరిష్కరించుకోవచ్చని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. శుక్రవారం జిల్లావ్యాప్తంగా 47 గ్రామసభల ద్వారా 728 అర్జీలు అందాయి. అందులో అసైన్‌మెంట్ ఆఫ్ హౌస్‌సైట్స్‌పై 155, అసైన్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ల్యాండ్‌పై 33, రీసర్వే 75, ఫాం 22ఏ 3, క్యాస్ట్ వెరిఫికేషన్ 4, ల్యాండ్ గ్రాబింగ్ 2, ఆర్‌వోఆర్ 389, ఇతర విషయాలకు సంబంధించి 52 వచ్చాయి. వాటిలో 29 అర్జీలను అప్పటికపుడే పరిష్కరించారు. మిగిలినవి కాలపరిమితిలోపు పరిష్కరిస్తారని కలెక్టర్ వెంకటేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. రేణిగుంట మండలం అన్నాసానిపల్లెలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డితో కలసి ఆయన రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు.

ఎస్వీయూలో చిరుత కలకలం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీలో శుక్రవారం తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో చిరుత కలకలం రేగింది. సైన్స్ కాలేజీ భవనానికి సమీపంలో విద్యార్థులకు చిరుత కనిపించడంతో పరుగులు తీశారు. అక్కడే పడిపోయిన ఒక విద్యార్థికి సపర్యలు చేసి, వెంట తీసుకెళ్లారు. రెండు వారాల క్రితం వేద విశ్వవిద్యాలయంలో చిరుత పాద ముద్రలు కనిపించిన విషయం తెలిసిందే. చిరుత సంచరిస్తున్నట్లు అనుమానిస్తున్న ఫారెస్టు అధికారులు యూనివర్సిటీ బొటానికల్ గార్డెన్‌ను తనిఖీ చేసి కొన్ని ఆనవాళ్లను పరిశీలించారు. ఈ ప్రాంతానికి సమీపంలోనే అమ్మాయిల హాస్టల్ కూడా ఉంది. రిజిస్ట్రార్ భూపతి నాయుడు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఫారెస్టు, పోలీసు సిబ్బంది యూనివర్సిటీకి చేరుకున్నారు. ఫారెస్టు అధికారులు శ్రీనివాసా ఆడిటోరియం వద్ద చిరుత పులి పాదముద్రలను సేకరించారు. కొన్ని చెట్లకు ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశారు. కాగా, పులి సంచారం నేపథ్యంలో రాత్రి 8 నుంచి ఉదయం 6.30 గంటల్లోగా ఎవరూ క్యాంపస్‌లో తిరగకూడదని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు ఆదేశించారు. అన్ని కాలేజీలు, విభాగాలు, హాస్టళ్లకు శుక్రవారం సర్క్యులర్ జారీ చేశారు.

అభివృద్ధికి హామీ.. మహిళలకు ధైర్యం!

- రెండవ రోజూ భువనేశ్వరి విస్తృత పర్యటన

కుప్పం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి రెండవ రోజైన శుక్రవారం చిత్తూరు జిల్లా కుప్పం మండలం వానగుట్టపల్లె, గుండ్లమడుగు, అడవిబూదుగూరు, కుప్పం మున్సిపాలిటీ డీకేపల్లెల్లో విస్తృతంగా పర్యటించారు. కుప్పం అభివృద్ధికి హామీ ఇస్తూ, మహిళలకు ధైర్యం చెబుతూ ఆమె పర్యటన సాగింది. మహిళలు కూడా సొంత కుటుంబంలోని వ్యక్తిలాగా చాలా చనువుగా తమ సమస్యల గురించి ప్రస్తావించి పరిష్కారాలు కోరారు.గత ప్రభుత్వ హయాంలో సాగిన అరాచకాలు, అభివృద్ధి లేమిపై విమర్శనాస్త్రాలు సంధించిన భువనేశ్వరి చంద్రబాబు అంతకంతకు అభివృద్ధి చేస్తారని ప్రజలకు నమ్మకం కలిగించగలిగారు. ఉదయం 11.30 గంటలకు వానగుట్టపల్లెలో మహిళలతో ముఖాముఖిలో ఆమె పాల్గొన్నారు. అక్కడి నుంచి అడవిబూదుగూరు, కుప్పం మున్సిపాలిటీ డీకేపల్లెలో జరిగిన సభల్లోనూ మహిళలతో ముఖాముఖి నిర్వహించారు. సమస్యలు సావధానంగా విన్న ఆమె చంద్రబాబుకు చెప్పి పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. మధ్యలో ప్రత్యంగరాదేవి దేవస్థానానికి వెళ్లి పూజలు చేసి, దేవికి వెండి కిరీటం బహూకరించారు. డీకేపల్లెలో సభ ముగిసేసరికి రాత్రి 7 గంటల సమయమైంది.



వానగుట్టపల్లెలో మహిళలతో ముఖాముఖి

స్వర్ణముఖిలో ఇసుక అక్రమ తరలింపును అరికట్టండి


అధికారులకు ఫిర్యాదులిస్తున్న అర్జీదారులు

చంద్రగిరి, డిసెంబరు 20(ఆంధ్ర జ్యోతి): నరసింగాపురం, రెడ్డివారిపల్లె సమీపంలో స్వర్ణముఖినదిలో అక్రమంగా ఇసుక తరలింపును అరికట్టాలని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఈ గ్రామాల్లో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో గ్రామస్తులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. నదిలో భారీ యంత్రాలతో ఇసుక తవ్వి టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారన్నారు. అడ్డుకొంటే తమపైనే దౌర్జన్యం చేస్తున్నారన్నారు. దీనిపై గతంలోనే రెవెన్యూ అధికారులకు అనేకసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదన్నారు. ఇకనైనా రెవెన్యూ అధికారులు అక్రమ ఇసుక తరలింపును అరికట్టకపోతే ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. ఇక్కడి సదస్సుల్లో 33 అర్జీలు వచ్చాయని, త్వరలోనే పరిష్కరిస్తామని తహసీల్దార్ శివరామసుబ్బయ్య తెలిపారు. సర్పంచులు రేవతిప్రకాష్‌రెడ్డి, చెంచురత్నం, ఎంపీటీసీ అశ్వనీ పాల్గొన్నారు.

కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న అంబేడ్కర్ భవన కమిటీ సభ్యులు

పాకాల, డిసెంబరు 20: డాక్టర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పార్లమెంటులో అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ స్థానిక అంబేడ్కర్ భవనం ఎదుట శుక్రవారం సాయంత్రం భవన కమిటీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అధికార అహంతో రాజ్యాంగ నిర్మాతను అవమానించడం దారుణమన్నారు. వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ఆయనను వెంటనే మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. బాధ్యతాయుత పదవులు నిర్వహిస్తున్న నాయకులు ఆదర్శంగా పాలించాలన్నారు. మంత్రిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. అంబేడ్కర్ విగ్రహం ఎదుట నినాదాలు చేశారు. కార్యక్రమంలో భవన కమిటీ అధ్యక్షుడు ఆంజినేయులు, కార్యదర్శి ప్రకాష్, కోశాధికారి శివప్రసాద్, రామయ్య, కృష్ణమూర్తి, రాజేంద్ర, నరసింహులు, ప్రభు, శ్రీరాములు, రామ్మూర్తి, జ్యోతి, డాక్టర్ రామకృష్ణ, ఉదయకుమార్, ఆదికేశవులు, అబ్దుల్ షబీర్, నాగరాజ, గోపి పాల్గొన్నారు.

నడవలూరులో కొనసాగుతున్న వైద్యసేవలు


సూచనలిస్తున్న వైద్యాధికారి,సిబ్బంది

రామచంద్రాపురం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నడవలూరులో జ్వర బాధితులకు శుక్రవారం కూడా వైద్య సేవలు అందించారు. నెలరోజులుగా పలువురు జ్వరాల బారిన పడటంతో గురువారం కమ్మపల్లి వైద్యాధికారి జావిద్ సిబ్బందితో ఇంటింటికి వెళ్లి వైద్యపరీక్షలు నిర్వహించిన సంగతి తెలిసిందే. సర్పంచ్ గణపతి, కార్యదర్శి సుమలత, వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం మురుగుకాలువల, తాగునీటి ట్యాంకులను శుభ్రపరిచారు. క్లోరినేషన్ చేశారు. గ్రామస్థలకు పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు.

తిరుచ్చిపై సిరుల తల్లి సాక్షాత్కారం



తిరుచానూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో పద్మావతి అమ్మవారు శుక్రవారం రాత్రి బంగారు తిరుచ్చిపై కొలువుదీరి తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. వేకువజామున సుప్రభాతసేవతో అర్చకులు అమ్మవారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. మూలమూర్తికి నేత్రపర్వంగా అభిషేకం నిర్వహించారు. ఉదయం కల్యాణోత్సవం, లక్ష్మీపూజ, మధ్యాహ్నం తిరుమంజనం నిర్వహించారు. అలంకార శోభితురాలైన పద్మావతిదేవికి తిరువీధి ఉత్సవం వేడుకగా జరిగింది. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, ఏవీఎస్‌వో సతీష్‌కుమార్, అర్చకుడు బాబుస్వామి, మణికంఠ స్వామి, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలపై విచారించి పరిష్కరిస్తాం : తహసీల్దార్


వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ వెంకటరమణ

రామచంద్రాపురం, డిసెంబరు 20(ఆంధ్ర జ్యోతి):గంగిరెడ్డిపల్లిలో శుక్రవారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దారు వెంకటరమణ మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు నిర్వహించిన సదస్సుల్లో 101 వినతులు వచ్చాయన్నారు. వీటిని గ్రామస్థాయిలో విచారించి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి డిల్లీనాథరెడ్డి, డిప్యూటీ తహసీల్దారు అమృత, ఆర్ఐ లక్ష్మీనారాయణ, వీఆర్వోలు గుణభూషణనాయుడు, రాజశేఖర్, శ్రీనివాసులు, బాబు, ఝాన్సీరాణి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరంగపట్టణానికి ధనుర్మాసయాత్ర బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పవిత్ర ధనుర్మాసం నేపథ్యంలో కర్ణాటకలోని శ్రీరంగ పట్టణానికి శుక్రవారం రాత్రి ప్రత్యేక యాత్ర బస్సులు బయలుదేరాయి. ఒక భక్తబృందం ఈ ఆలయ సందర్శనార్థం మూడు సూపర్ లగ్జరీ బస్సులను బుక్ చేసుకుంది. 104 మందితో బస్సులు తిరుపతి సెంట్రల్ బస్‌స్టేషన్ నుంచి బయలుదేరాయి. డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, డిపో మేనేజర్ బాలాజీ పచ్చజెండా ఊపి బస్సులను ప్రారంభించారు.

ట్రాక్ పనులను పరిశీలించిన డీటీవో

తిరుపతి(రవాణా), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఆర్టీఏ కార్యాలయంలో త్వరలో ప్రారంభం కానున్న అడ్వాన్స్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్ పనులను జిల్లా రవాణాశాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ శుక్రవారం పరిశీలించారు. ఇదివరకు ఉన్న డ్రైవింగ్ ట్రాక్‌లో నూతన సెన్సార్ విధానంతో కొత్త ట్రాక్ ఏర్పాటు చేస్తున్న విషయం విదితమే. ట్రాక్ పనులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఎంవీఐలు సుబ్రహ్మణ్యం, అటికానాజ్, స్వర్ణలత ఆయన వెంట ఉన్నారు.

ప్రొద్దుటూరు పూర్వ కమిషనర్లపై విచారణాధికారిగా మున్సిపల్ ఎస్ఈ

తిరుపతి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ప్రొద్దుటూరులో ఇదివరకూ పనిచేసిన ఇద్దరు మున్సిపల్ కమిషనర్లపై విచారణాధికారిగా తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎం.శ్యామ్ సుందర్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు మున్సిపల్ పరిపాలనా శాఖ కార్యదర్శి కన్నబాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

క్రీడారంగం అభివృద్ధికి సహకరించండి


కేంద్రమంత్రి మాండవీయకు వినతిపత్రం అందజేస్తున్న రవినాయుడు, చిత్రంలో ఎంపీలు హరీష్, అప్పలనాయుడు

న్యూఢిల్లీ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఏపీలో క్రీడా సౌకర్యాలను కల్పించాలని కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవీయకు శాప్ ఛైర్మన్ రవినాయుడు విజ్ఞప్తి చేశారు. టీడీపీ ఎంపీలు జీఎం హరీష్, కలిశెట్టి అప్పలనాయుడుతో కలిసి కేంద్ర మంత్రితో శుక్రవారం ఆయన భేటీ అయ్యారు. రూ.237 కోట్ల విలువైన 24 స్పోర్ట్స్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టులను ఖేలో ఇండియాలో భాగంగా మంజూరు చేయాలన్నారు. తిరుపతిలోని ఖేలో ఇండియా రెసిడెన్సియల్ సెంటర్‌లో అథ్లెటిక్స్, రెజ్లింగ్ విభాగాలకు సంబంధించిన సెంటర్లను ఏర్పాటు చేయాలని, క్రీడాకారుల రైల్వే రాయితీలను పునఃప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడితో భేటీ సందర్భంగాక్రీడావసతుల ఏర్పాటుకు 10శాతం సీఎస్ఆర్ నిధులను సమకూర్చేందుకు సహకరించాలని కోరారు.

ఉపాధి హామీ పనుల్లో లోపాలు : ఇద్దరి సస్పెన్షన్

భాకరాపేట, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల్లో లోపాలకు సంబంధించి ఇద్దరికి సస్పెండ్ చేసినట్లు డ్వామా పీడీ శ్రీనివాస్ ప్రసాద్ తెలిపారు చిన్నగొట్టిగల్లు మండలంలో గత ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులపై శుక్రవారం సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. 13 పంచాయతీల్లో 1880 పనులకు రూ.5.34 కోట్లు ఖర్చు చేశారు. వారం రోజులుగా సామాజిక తనిఖీ బృందం క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించి వివరాలను ఈ సమావేశంలో వెల్లడించారు. కందకాల పూడ్చివేత, మామిడి మొక్కలు చనిపోవడం, అవెన్యూ ప్లాంటేషన్‌లో మొక్కలు లేకపోవడం, పనుల వద్ద పేర్లు లేకపోవడం వంటి వాటికి సంబంధించి రూ.3.93 లక్షల రికవరీకి ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పనులు తనిఖీ చేయకపోవడం, వర్క్ ఫైల్స్ ఇవ్వకపోవడంతో టెక్నికల్ అసిస్టెంట్ రంజిత్‌ను సస్పెండ్ చేశారు. అలాగు హౌసింగ్‌లో బిల్లులు లబ్ధిదారులకు కాకుండా వేరే ఖాతాలకు మళ్లించడం, మస్టర్లో సంతకాలు లేకపోయినా వేతనాలు చెల్లించడంతో కంప్యూటర్ ఆపరేటర్ బాలకృష్ణారెడ్డిని సస్పెండ్ చేశారు. ఎంపీడీవో గిడ్డయ్య, డీవీవో శివయ్య, ఏపీడీ రెడ్డప్ప, ఏపీవో భార్గవి ఎస్ఆర్పీ వెంకయ్య, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు బెల్లంకొండ మురళి, క్లస్టర్ ఇన్‌చార్జ్ శివకుమార్, వైస్ఎంపీపీ సునీత, ఎంపీటీసీ విజయ్ కుమారి, ఆర్పీ రమణారెడ్డి పాల్గొన్నారు

కోటిలింగేశ్వరస్వామి సేవలో సినీహీరో అఖిల్

రామచంద్రాపురం, డిసెంబరు 20(ఆంధ్ర జ్యోతి): రాయలచెరువు కట్ట కోటిలింగేశ్వరస్వామిని సినీ హీరో అఖిల్, దర్శకుడు మురళి కిషోర్ అబ్బూరు శుక్రవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ నిర్వాహకులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. కమ్మకండ్రిగ గ్రామానికి చెందిన మురళి కిషోర్ అబ్బూరు తాను దర్శకత్వం వహించే చిత్రానికి ముందుగా ఆలయానికి వచ్చి స్వామి వారిని దర్శించుకోవడం ఆనవాయితీ.ఆయన దర్శకత్వంలో అఖిల్ నటించనున్నారు.

అష్టలక్ష్మి పూజల్లో రాజస్థాన్ విద్యుత్‌శాఖ మంత్రి

రామచంద్రాపురం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): సి.రామాపురంలోని బ్రహ్మర్షి తీర్థ ఆశ్రమంలో జరుగుతున్న అష్టలక్ష్మి నవరాత్రి పూజల్లో శుక్రవారం రాజస్థాన్ విద్యుత్‌శాఖ మంత్రి హిరాలాల్ నాగర్ పాల్గొన్నారు. అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. తరువాత గురూజీని కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. మంత్రికి ఆశ్రమ ప్రతినిధులు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు.

హాస్టల్ విద్యార్థుల ఆకతాయి చేష్టలు

● కౌన్సెలింగ్ ఇచ్చిన పోలీసులు

చంద్రగిరి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపేటలోని ఎస్సీ ప్రభుత్వ బాలుర వసతి గృహంలోని విద్యార్థులు శుక్రవారం రాత్రి అల్లరి చేష్టలకు పాల్పడటంతో స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో పోలీసులు వెళ్లి విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి, హెచ్చరించారు. శుక్రవారం రాత్రి విద్యార్థులు తమ వసతి గృహం చుట్టు పక్కల ఉన్న ఇళ్లపై రాళ్ళు వేశారు. దీంతో బాధిత ఇళ్లవారు పోలీసులకు తెలియజేశారు. విద్యార్థులకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించి ఇకపై ఇలాంటి చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రాత్రి హాస్టల్ వార్డెన్ లేకపోవడంతో విద్యార్థులు గదుల్లో నుంచి బయటకు వచ్చి ఆకతాయి చేష్టలు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ పొదుపు అలవరుచుకోవాలి

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భావితరాల కోసం విద్యార్థులు విద్యుత్ పొదుపు అలవరుచుకోవాలని తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ ఈఈ వి.చంద్రశేఖరరావు కోరారు. ఇంధన పొదుపు వారోత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం అవిలాల సెక్షన్ పరిధిలోని ఎమ్మార్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈఈ మాట్లాడుతూ ఒక యూనిట్ విద్యుత్ పొదుపు రెండు యూనిట్ల ఉత్పత్తితో సమానమన్నారు. ఇంట్లో అనవసరంగా ఫ్యాన్లు, లైట్లు, ఇతర విద్యుత్ పరికరాలు వాడరాదని సూచించారు. ఏడీఈ ఆంజనేయులు, ఏఈ మునిరామ్ పాల్గొన్నారు.

నేడు జార్ఖండ్ సీఎం రాక

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 20(ఆంధ్ర జ్యోతి): జార్ఖండ్ సీఎం హేమంత్‌సోరెన్ శనివారంతిరుమల రానున్నట్లు అధికారులు తెలిపారు. మధ్యాహ్నం తిరుమల చేరుకుని శ్రీవారిని దర్శించుకుంటారని, 3.55 గంటలకు తిరుచానూరు పద్మావతి అమ్మవారిని దర్శించుకుని, 5గంటలకు విమానాశ్రయానికి చేరుకుని తిరుగు ప్రయాణమవుతారని పేర్కొన్నారు.

జనవరి 28 నుంచి పద్మావతి వర్సిటీలో సలెస్త్రా-2024

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీలో జనవరి 28వ తేదీ నుంచీ సెలెస్త్రా-2024 కార్యక్రమం నిర్వహించనున్నారు. రెండు రోజుల పాటు చేపట్టే ఈ కార్యక్రమంలో విద్యార్థులకు సాంకేతిక, సాంస్కృతిక ప్రతిభా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను వర్సిటీ వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని శుక్రవారం విడుదల చేశారు.

కార్గో డోర్ డెలివరీ సౌకర్యాన్ని వాడుకోండి

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. కలెక్టరేట్‌లో శుక్రవారం వీటికి సంబంధించి బ్యానర్లు, కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. పార్సిల్ కౌంటర్ నుంచి పది కిలోమీటర్ల వరకు 50 కేజీల బరువైన పార్సిల్‌ను ఇంటివద్దకే చేరవేస్తారన్నారు. డిజిటల్ విధానంలో పార్సిల్ బుక్ చేసుకోవడానికి సేవలను ప్రవేశపెట్టారన్నారు. బాలాజీ, బస్‌స్టేషన్ మేనేజరు డీఆర్ నాయుడు పాల్గొన్నారు.

పాడి రైతులకు వరం 'గోకులం'

కూటమి ప్రభుత్వంలో పూర్వ వైభవం



గోకులం పథకంలో ఏర్పాటు చేసుకున్న షెడ్డు

చంద్రగిరి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో మూలకు చేరిన 'గోకులం' పథకానికి కూటమి ప్రభుత్వంలో మళ్లీ మంచి రోజులొచ్చాయి. పాడి పరిశ్రమను అభివృద్ధి చేయడానికి ప్రవేశపెట్టిన ఈ పథకానికి పాడి రైతుల నుంచి విశేషాదరణ లభిస్తోంది. ఇన్నాళ్లూ గోకులం నిర్మాణాలను గాలికొదిలేసిన నేపథ్యంలో అధికారులు ఇప్పుడు పూర్తి శ్రద్ధ కనబరుస్తున్నారు. నిర్మాణాల తీరుపై దృష్టి సారిస్తున్నారు. గోకులం పథకం యూనిట్ విలువలో పది శాతం లబ్ధిదారులు చెల్లిస్తే సరిపోతుంది. ప్రభుత్వం 90 శాతం ఉపాధి హామీ పథకం నుంచి నిధులిస్తోంది. దీంతో 2, 4, 6 కేటగిరీల కింద పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల కోసం షెడ్లు ఏర్పాటు చేసుకోవచ్చు. కొన్ని కేటగిరీల్లో 30 శాతం లబ్ధిదారులు చెల్లిస్తే 70 శాతం ఉపాధి హామీ పథకం నిధులు ఇస్తున్నారు. చంద్రగిరి మండలంలో ఇప్పటివరకు 273 దరఖాస్తులు వచ్చాయి. మొదటి దశలో 104 దరఖాస్తులకు ఆమోదం లభించింది. రెండవ దశలో మిగిలిన దరఖాస్తులను మంజూరు చేస్తామని పశుసంవర్థక అధికారులు చెబుతున్నారు. దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు,జాబ్ కార్డు, స్థలం హక్కు పత్రం,బ్యాంక్ పాస్ బుక్ సమర్పించాల్సి ఉంటుంది.

అర్హులెవరంటే..

ఎస్సీ, ఎస్టీ, వలస, డీ-నోటిఫైడ్ తెగలవారు,దారిద్ర్యరేఖ దిగువ ఉన్నవారు, అంగ వైకల్య యజమాని కుటుంబాలు, భూ సంస్కరణ, పీఎంఏవైజీ లబ్దిదారులు,అటవీ హక్కుల చట్టం-2006 లబ్ధిదారులు,చిన్న,సన్నకారు రైతులు గోకులం పథకం కింద లబ్ధి పొందేందుకు అర్హులని పశు సంవర్ధకశాఖాధికారులు తెలిపారు..

తక్కువ పెట్టుబడితో లబ్ధి



గోకులం పథకం కింద తక్కువ పెట్టుబడితో పశువులకు షెడ్లు ఏర్పాటు చేసుకోవచ్చు. మొదటి దశలో ఎ.రంగంపేట నుంచి భీమవరం వరకు పరిధిలో దరఖాస్తులకు ఆమోదం తెలిపాం. మిగిలిన దరఖాస్తులను రెండవ దశలో మంజూరు చేస్తాం. ఇంకా దరఖాస్తులు వస్తున్నాయి. పశువైద్యశాఖలో, రైతుసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి.

-డాక్టర్ వంశీ, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, నారావారిపల్లె పశువైద్యశాల

10న కల్యాణ వెంకన్న ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు



చంద్రగిరి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జనవరి 10న వైకుంఠ ఏకాదశి, 11న వైకుంఠ ద్వాదశి పర్వదినాల సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 10వ తేదీ వేకువజామున 12.05 గంటల నుంచి 3.30 గంటల వరకు ధనుర్మాస కైంకర్యాలు, తోమాల సేవ, కొలువు, పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. వేకువజామున 3.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సర్వదర్శనానికి అనుమతిస్తారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు కైంకర్యాలు, తర్వాత రాత్రి 9 గంటల వరకు దర్శనానికి అనుమతిస్తారు. 11న ద్వాదశి సందర్భంగా ఉదయం 4 నుండి 5.30 గంటల వరకు ధనుర్మాస కైంకర్యాలు, తోమాల సేవ, కొలువు, పంచాంగ శ్రవణం ఉంటుంది. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు చక్రస్నానం నిర్వహిస్తారు. ఆంగ్ల నూతన సంవత్సరాది జనవరి 1న వేకువజామున ఒంటి గంట నుంచి 4 గంటల వరకు ధనుర్మాస కైంకర్యాలు, తోమాల సేవ, కొలువు, పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. వేకువజామున 4 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సర్వదర్శనానికి అనుమతిస్తారు. సాయంత్రం 5 నుండి 6 గంటల వరకు రాత్రి కైంకర్యాలు, తర్వాత రాత్రి 8.30 గంటల వరకు దర్శనానికి అనుమతిస్తారు. పర్వదినాలను పురస్కరించుకుని టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఆరేడు నెలల వరకూ కల్యాణి డ్యాంలో సమృద్ధిగా నీరు

● కమిషనర్ ఎన్.మౌర్య


డ్యామ్‌లో నీటిని పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

చంద్రగిరి, డిసెంబరు 20(ఆంధ్ర జ్యోతి): తిరుపతి నగరానికి తాగునీరు అందించే కల్యాణి డ్యామ్ నీటి మట్టాన్ని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య శుక్రవారం ఇంజినీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. డ్యామ్ 900 మిలియన్ క్యూబిక్ అడుగుల సామర్థ్యం కలిగి ఉంది. ప్రస్తుతం 310 మిలియన్ క్యూబిక్ అడుగుల మేర నీటిమట్టం ఉంది. డ్యామ్‌లోకి శేషాచలం అడవుల నుంచి వచ్చే ఇన్‌ఫ్లో, రోజూ తాగునీటి కోసం తరలించే ఔట్ ఫ్లో తదితర అంశాలను ఇంజినీరింగ్ అధికారులు కమిషనర్‌కు వివరించారు. కమిషనర్ మౌర్య మాట్లాడుతూ తిరుపతి ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. ప్రస్తుత నీరు ఆరేడు నెలల వరకు సరఫరా అయ్యే అవకాశం ఉందన్నారు. వర్షపునీరు భారీగా డ్యామ్‌కు చేరితే ఇబ్బందులు ఉండవన్నారు. పైప్‌లైన్లు ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. కమిషనర్ వెంట మునిసిపల్ ఇంజినీర్ గోమతి, డీఈ మధుకుమార్ ఉన్నారు.

శిల్పారామంలో ఖాదీ ఎగ్జిబిషన్ ప్రారంభం


నేత కార్మికులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుచానూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఖాదీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని జిల్లాకలెక్టర్ వెంకటేశ్వర్ ప్రజలకు పిలుపునిచ్చారు. తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో శుక్రవారం ఖాదీ మహోత్సవ్ ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చేతి వృత్తుల ఉత్పత్తులను కొనుగోలు చేసి ఆర్థికంగా ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈనెల 29వ తేదీ వరకు ఎగ్జిబిషన్‌ను సందర్శించవచ్చునన్నారు. ఖాదీతో పాటు గ్రామీణ హస్తకళలు, కలంకారీ ఉత్పత్తులు కూడా ఎగ్జిబిషన్‌లో ఉన్నాయన్నారు. కేవీఐసీ డిప్యూటీ సీఈవో మదన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ శిల్పారామం ఎగ్జిబిషన్‌లో ఖాదీ ఉత్పత్తులతో వంద స్టాల్స్ ఏర్పాటు చేశామన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల చేతి వృత్తుల కళాకారులు తమ వస్తువులను ఎగ్జిబిషన్‌లో విక్రయిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కేవీఐసీ రాష్ట్ర డైరెక్టర్ గ్రీప్, ఏడీ కోటిరెడ్డి, పద్మావతిపురం సర్పంచ్ జ్యోతి, లీడ్‌బ్యాంకు మేనేజరు విశ్వనాథరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం పాల్గొన్నారు.


ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివాన్ని శుక్రవారం చంద్రగిరికి చెందిన నాయీ బ్రాహ్మణ సంఘం నేతలు తిరుపతిలో సన్మానించారు. కొత్తపల్లి వేణుగోపాల్, కొత్తపల్లి విజయ్, ఆవులపాటి చందు, ఏ గోకుల్, కే మనోజ్ తదితరులు సన్మానించిన వారిలో ఉన్నారు.

మార్చి నెల శ్రీవాణి, ఎస్ఈడీ టికెట్ల విడుదల తేదీల మార్పు

తిరుమల, డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి శ్రీవాణిట్రస్టు టికెట్లు, ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లకు సంబంధించిన మార్చి నెల కోటా విడుదల తేదీల్లో టీటీడీ మార్పులు చేసింది. వైకుంఠ ఏకాదశి సందర్భంగా జనవరి 10 నుంచి 19వ తేదీ వరకు పదిరోజుల పాటు తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనాలు జరుగనున్నాయి.ఈ క్రమంలో ఈపదిరోజులకు సంబంధించిన శ్రీవాణిట్రస్టు టికెట్లను డిసెంబరు 23వ తేదీన ఉదయం 11 గంటలకు, రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లను 24వ తేదీన ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నారు. దీంతో మార్చి నెలకు సంబంధించిన శ్రీవాణి, రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా ఆన్‌లైన్ విడుదల తేదీలను మార్చినట్టు టీటీడీ శుక్రవారం ఓ ప్రకటన ద్వారా తెలిపింది. 25వ తేదీన ఉదయం 11 గంటలకు మార్చి నెల శ్రీవాణి టికెట్లను, 26వ తేదీన ఉదయం 11 గంటలకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లను విడుదల చేయనున్నారు. అలాగే అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు వసతి గదుల కోటాను కూడా విడుదల చేస్తారు.భక్తులు వీటిని 'టీటీదేవస్థానమ్స్.ఏపీ.జీవోవీ.ఇన్' అనే అధికారిక వెబ్‌సైట్ నుంచి బుక్ చేసుకోవచ్చు.

లక్ష కుంకుమార్చన

రామచంద్రాపురం, డిసెంబరు 20(ఆంధ్ర జ్యోతి): రాయలచెరువు కట్ట కోటిలింగేశ్వరాలయ ప్రాంగణంలో ని కామాక్షమ్మవారి ఆలయంలో శుక్రవారం లక్ష కుంకుమార్చన జరిగింది. విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకారం చేపట్టారు. మహిళలు లక్ష కుంకుమార్చనలో పాల్గొన్నారు.

ధనుర్మాస పూజలతో వైకుంఠ ప్రాప్తి



తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పెద్దకాపు వీధిలోని శ్రీరామ మందిరంలో రామ భజన చేపట్టారు. ధనుర్మాసం సందర్భంగా రాముల వారి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉభయదారులుగా మునిరాజ కుటుంబం వ్యవహరించింది. భజన మండలి సభ్యుడు వెంకటనారాయణ మాట్లాడుతూ ధనుర్మాసంలో పూజలు చేస్తే వైకుంఠ ప్రాప్తి లభిస్తుందన్నారు. చిన్నబ్బ, మునికృష్ణయ్య, బాలసుబ్రమణ్యం, సుబ్బారెడ్డి, ఉమాపతి, రాజా పాల్గొన్నారు.

ఏపీఎంఈడబ్ల్యూయూ రాష్ట్ర కోశాధికారిగా మహేంద్ర



తిరుపతి(వైద్యం), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏపీ ఎం ఈడ బ్ల్యూయూ) రాష్ట్ర కోశాధికారిగా పుట్టా మహేంద్రను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి జిల్లాలో ఏపీ ఎంఈడబ్ల్యూయూ నేతలు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎన్నో పోరాటాలు చేశారని, దాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర కమిటీలో చోటు కల్పించామని వివరించారు. కోశాధికారిగా పుట్టా మహేంద్ర, కార్యవర్గ సభ్యులుగా నరసింహులు, పురుషోత్తం, కిషోర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. మహేంద్ర మాట్లాడుతూ ఎంప్లాయిస్ వర్కర్స్ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు.

చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురండి


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీల్లో నిరుపయోగంగా ఉన్న సాలిడ్‌వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్ల(చెత్తసంపద కేంద్రాలు)ను వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. గ్రామపంచాయతీల బలోపేతంపై కలెక్టరేట్‌లో శుక్రవారం ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమీక్షించారు. నిరుపయోగంగా ఉన్న చెత్త సంపద కేంద్రాలను ఈనెల 31వ తేదీలోపు ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు. తాగునీటి బోర్లను క్లోరినేషన్ చేయాలని, ఓవర్‌హెడ్ ట్యాంకులను 15 రోజులకు ఒకసారి శుభ్రపరచాలని తెలిపారు. ప్రతి గురువారమూ వర్మీ కంపోస్టు, నిల్వ ఉన్న చెత్తను అమ్మి వచ్చిన ఆదాయాన్ని పంచాయతీల ఖాతాలో జమ చేయాలన్నారు. ఉచిత ఇసుక విధానం సక్రమంగా అమలయ్యేలా చూడాలని, ప్రజలు వ్యాధుల బారిన పడకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, జిల్లా పంచాయతీ అధికారి సుశీలదేవి, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు పాల్గొన్నారు.

ఓటేరులో అక్రమ నిర్మాణాల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


ఎక్సవేటర్‌తో రేకుల ఇంటి నిర్మాణం తొలగింపు

తిరుపతిరూరల్, డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): ఓటేరు పంచాయతీ పరిధిలో సర్వేనంబరు 360లోని స్వర్ణముఖినది పొరంబోకు స్థలంలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను ఎక్సవేటర్ సాయంతో శుక్రవారం రెవెన్యూ అధికారులు తొలగించారు. ఓటేరులో ఆక్రమణదారుల బరితెగింపు శీర్షికన ఇటీవల ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై రూరల్ తహసీల్దార్ రామాంజులునాయక్ స్ప ందించారు. స్థలాన్ని పరిశీలించి నివేదించాలని స్థానిక రెవెన్యూ అధికారులను ఆదేశించారు. నది పొరంబోకు స్థలంలో అక్రమనిర్మాణం చేపట్టారని వారు గుర్తించారు. దీంతో తహసీల్దార్ ఆదేశాల మేరకు తాజాగా ఎంఆర్‌పల్లె పోలీసుల సాయంతో ఈఅక్రమ నిర్మాణాలను తొలగించారు. ఇదేస్థలానికి సమీపంలో సర్వేనంబరు 360లో స్వర్ణముఖినది పొరంబోకు స్థలంలో ఆక్రమణదారులు నాటిన జామాయిల్ మొక్కలను కూడా తొలగించారు.

పైపులైన్‌కు మరమ్మతులు


పైపులైన్‌కు మరమ్మతులు

తుమ్మలగుంట పంచాయతీ పరిధిలోని చెంచువారికాలనీ మార్గంలో తాగునీటి పైపులైన్‌కి శుక్రవారం మరమ్మతులు చేశారు. గురువారం ఆంధ్రజ్యోతిలో పైపుపగిలి తాగునీరు వృధా శీర్షికన ప్రచురితమైన వార్తకు కార్యదర్శి వెంకటేశ్వర్లు స్పందించారు. శుక్రవారం పరిశీలించి పైపులైన్ బాగుచేయించారు. రోడ్డుపక్కన వ్యర్థాలను పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు.

పట్టించుకోండి సారూ..!



సత్యనారాయణపురం సర్కిల్‌లో ఉదయం పూట నిత్యం ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. 7.30నుంచి 8.30 గంటల వరకు ట్రాఫిక్‌తో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఈ సర్కిల్లో అలిపిరి పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో చిన్నపాటి అవుట్ పోస్ట్ ఏర్పాటు చేశారు. పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేవారు. ఇటీవల రోడ్డు వెడల్పు చేసే సందర్భంగా అవుట్ పోస్టు తీసేశారు. దీంతో మళ్లీ సమస్య ఉత్పన్నమైంది. పోలీసులు దృష్టి సారించాల్సి ఉంది.

- తిరుపతి (జీవకోన), (ఆంధ్రజ్యోతి)

చెత్త కుప్పల తొలగింపు



చెత్త నిల్వలను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

తిరుపతి అర్బన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మంగళంలోని బీసీఎం స్కూల్‌కు సమీపంలో చెత్తకుప్పల నిల్వలను తొలగించారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో 'పట్టించుకోండి సారూ..' శీర్షికన దీనిపై కథనం ప్రచురితమైంది. సప్తగిరికాలనీ గ్రామ సచివాలయ కార్యదర్శి జయశంకర్ స్పందించి చెత్తకుప్పలతో పాటు కంపచెట్లను తొలగించేలా చర్యలు చేపట్టారు. స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ టోర్నీకి ఆంగ్రూ ఫుట్‌బాల్ జట్టు



కబడ్డీ క్రీడాకారులతో కళాశాల అధికారులు

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రం కాలికట్ యూనివర్సిటీలో జరగనున్న దక్షిణ భారతదేశ స్థాయి అంతర విశ్వవిద్యాలయాల ఫుట్‌బాల్ టోర్నమెంటుకు ఆంగ్రూ జట్టు ఎంపికైనట్లు వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ రవికాంత్‌రెడ్డి తెలిపారు. కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.వి.రమణ చేతుల మీదుగా క్రీడా దుస్తులు, ఇతర వస్తువులను అందజేశారు. సౌత్‌జోన్ టోర్నీలోనూ రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మేనేజర్ పురుషోత్తమరావు, జట్టు శిక్షకుడు ఎం.విజయ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ పరిధిలోని అలిపిరి, స్విమ్స్, ఈఎస్‌ఐ 33-11 కేవీ ఫీడర్స్ పరిధిలో శనివారం విద్యుత్ తీగల మరమ్మతులు, చెట్ల కొమ్మల కత్తిరింపు చేపట్టనున్న నేపథ్యంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ ఈఈ వి.చంద్రశేఖరరావు ఒక ప్రకటనలో తెలిపారు. స్విమ్స్, బర్డ్, రుయా ఆస్పత్రులు, మెడికల్ కళాశాల, సంజయ్ గాంధీనగర్, మారుతీనగర్,న్యూ మున్సిపల్ కార్యాలయ పరిసర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలోవున్న విద్యుత్ వినియోగదారులు విదుత్ సరఫరా అంతరాయాన్ని గుర్తించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

'పారదర్శకంగానే దుకాణాల టెండరు'

తిరుపతి(వైద్యం), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రుయాస్పత్రిలో ఈనెల 17న నిర్వహించిన దుకాణాల టెండరు ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పారదర్శకంగానే నిర్వహించామని సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్పత్రి ఆవరణలోని పది దుకాణాలకు గతంలో ఇచ్చిన లీజు గడువు తీరిపోయినందున తిరిగి టెండర్లు పిలిచామని పేర్కొన్నారు. ఎక్కువ అద్దె చెల్లించేందుకు ముందుకు వచ్చిన వారికి నిబంధనల మేరకే దుకాణాలు కేటాయించామని వివరించారు. అయితే దీనికి సంబంధించి వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని తెలిపారు.

కొండూరులో ఆక్రమణలు తొలగించండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తడ మండలం కొండూరు గ్రామ లెక్కదాఖల సర్వే నెంబరు 148లో గుంట పొరంబోకును శక్తి పీఠం పేరుతో కబ్జా చేశారని, ఆక్రమణలను తొలగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, స్థానికులు కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కోరారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిలో ఆలయం పేరుతో రేకుల షెడ్డు వేసినా రెవెన్యూ, పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని వివరించారు.

జోరుగా క్రీడాభివృద్ధి పనులు



ఇండోర్ స్టేడియంలో రంగులు వేస్తున్న కార్మికులు

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో క్రీడా విభాగానికి సంబంధించి రూ.62లక్షలతో అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కొన్ని రోజుల క్రితం కూలిపోయిన ఎస్వీయూ స్టేడియం దక్షిణ దిశలో ఉన్న పురాతన ప్రహరీ గోడ తిరిగి నిర్మిస్తున్నారు. రూ.10లక్షలతో మైదానం రూఫ్ గ్యాలరీకి మరమ్మతులతో పాటు రంగులు వేస్తున్నారు. ఎస్వీయూ వ్యాయామ విభాగం భవనం చుట్టూ రూ.12లక్షలతో ప్రహరీ గోడ నిర్మించనున్నారు. ఇండోర్ స్టేడియంను ఆధునికీకరిస్తున్నారు. దీని చుట్టూ కూడా ప్రహరీ గోడ నిర్మించనున్నారు.



స్టేడియం పక్కన పునర్నిర్మించిన ప్రహరీ

అంబేడ్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలు బాధాకరం

కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్



మీడియాతో మాట్లాడుతున్న చింతామోహన్

తిరుపతి(లీలామహల్), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌పై కేంద్ర హోంశాఖా మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలను ఖండిస్తున్నానని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగంతోనే ఇప్పుడు పలువురు పదవులు అనుభవిస్తున్నారన్నారు. 1984 వరకు అంబేడ్కర్ జయంతి వేడుకలు గొప్పగా జరగలేదని, 1984 తర్వాతే గ్రామగ్రామానా ఆయన గొప్పతనం తెలిసి వచ్చిందని అన్నారు. అంతకు ముందు ఏమి జరిగిందో దేశంలోని రీసెర్చ్ స్కాలర్లందరూ పరిశోధనలు చేసి పుస్తకాలు రాస్తే నిజానిజాలు ప్రపంచానికి తెలుస్తాయన్నారు. అంబేడ్కర్ మరణానంతరం వారి కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి భరోసా అందలేదని తెలిపారు. అమిత్‌షాకి ఏమీ తెలియదని, బుల్డోజర్లు పంపడం మాత్రమే తెలుసునని ఎద్దేవా చేశారు. మోదీ పాలనలో రోజురోజుకూ ప్రజాస్వామ్యం బలహీనపడుతోందన్నారు. ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీపై కేసు నమోదు చేయడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు యార్లపల్లి గోపిగౌడ్, రవి, తేజోవతి, అబ్దుల్‌మజీల్, పటేల్, రావణ్, వెంకటేష్‌గౌడ్, సమీవుల్లా, కుమార్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక, సామాజిక రంగాల్లో ఎదగాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

మంగళం, డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థిక, సామాజిక రంగాల్లో ఎదగాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. శుక్రవారం టీటీడీసీ కార్యాలయంలో తిరుపతి జిల్లా సమాఖ్య సర్వసభ్య సమావేశం రెండవ వార్షిక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబం నుంచి ఒక ఔత్సాహిక పారిశ్రామికవేత్తను తయారు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, అందుకనుగుణంగా స్వయం సహాయక సంఘాల సభ్యులు తర్ఫీదు కావాలని పేర్కొన్నారు. మహిళలకు డ్రోన్ టెక్నాలజీపై అవగాహన కల్పిస్తామన్నారు. రూఫ్‌టాప్ సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకుని సౌర విద్యుత్ వినియోగించాలని సూచించారు. రుణాలు సకాలంలో బ్యాంకులకు చెల్లిస్తే టైంస్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం విరివిగా రుణాలు అందిస్తారన్నారు. డీఆర్డీఏ పీడీ శోభన్‌బాబు మాట్లాడారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సమావేశంలో ఎల్డీఎం విశ్వనాథరెడ్డి, డీపీఎం వెంకటేష్, జిల్లా సహకార శాఖ అధికారి లక్ష్మి, వెలుగు ఏపీఎం ప్రభావతి, ఏపీఎస్ఎస్డీసీ లోకనాథం పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఆందోళన



ఆందోళన చేస్తున్న విద్యార్థులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఎస్వీయూలో శుక్రవారం విద్యార్థులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి శివారెడ్డి మాట్లాడుతూ యూనివర్సిటీ హాస్టళ్లలో విద్యార్థులకు ఉచిత భోజన సదుపాయం కల్పించాలన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ మంజూరు కాలేదని విద్యార్థులను పరీక్షలకు అనుమతించని కాలేజీలపై చర్యలు తీసుకోవాలన్నారు. జీవో 77 ను రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చలపతి, ఉదయ్, ప్రవీణ్, చంద్రనాయక్, హరికృష్ణ, వెన్నెల, శ్రావణి, సత్య యామిని, నిత్య, సుబ్బు, విష్ణు, హరి తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 42 మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన 42 మందికి రూ.10వేలు చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగవ అదనపు న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ తీర్పు చెప్పారు. ఈ ఏడాది రూ.1.30 కోట్లు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో ప్రభుత్వానికి ఆదాయం సమకూరిందని ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు.

భవనం నుంచి పడి విద్యార్థికి గాయాలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ పరిధిలోని విశ్వకర్మ హాస్టల్‌లో ఓ విద్యార్థి భవనం నుంచి కిందపడ్డాడు. తోటి విద్యార్థుల వివరాల మేరకు.. ఉమ్మడి అనంతపురం జిల్లా ధర్మవరానికి చెందిన అరవింద్ వర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ ట్రిపుల్ ఈ విభాగంలో బీటెక్ ఫైనలియర్ చదువుతున్నాడు. శుక్రవారం ల్యాబ్ పరీక్షలు ఉండటంతో రాత్రి దాకా చదువుకున్నాడు. తెల్లవారుజామున 4 గంటల సమయంలో విశ్వకర్మ హాస్టల్ భవనం రెండవ అంతస్తుపై నుంచి కిందపడ్డాడు. అరుపులు విన్న తోటి విద్యార్థులు నిద్రలేచి 108కి సమాచారం అందించి, రుయా అత్యవసర విభాగానికి తరలించారు. నడుము, గడ్డం, ఇతర శరీర భాగాల్లో తీవ్ర గాయాలైనట్లు తెలుస్తోంది. మెరుగైన వైద్యం కోసం వేలూరు సీఎంసీకి తరలించారు. నడుముకు శస్త్ర చికిత్స చేయాలని వైద్యులు తెలిపినట్లు కుటుంబ సభ్యులు చెప్పారు. విద్యార్థికి మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటామని రిజిస్ట్రార్ భూపతినాయుడు తెలిపారు.

భక్త సమ్మేళన వేడుకలను జయప్రదం చేయండి

తిరుపతి(లీలామహల్), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతి - తిరుచానూరు రోడ్డులోని శ్రీనివాస కల్యాణ మండపంలో ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు జరగనున్న భక్త సమ్మేళన వేడుకలను జయప్రదం చేయాలని రామకృష్ణ మఠం నిర్వాహకులు సుకృతానందస్వామి కోరారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ యువతను భావిభారత నేతృత్వానికి సిద్ధం చేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు.

సైబర్ సెక్యూరిటీపై నేడు సదస్సు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సైబర్ సెక్యూరిటీ అంశంపై ఎస్వీ యూనివర్సిటీలో శనివారం సదస్సు నిర్వహించనున్నారు. ద ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ తిరుపతి బ్రాంచ్ - డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టాయి. ఉదయం 10 గంటలకు శ్రీనివాస ఆడిటోరియంలో ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. సైబర్ సెక్యూరిటీ నిపుణుడు ఎల్.ఎల్.నరసింహారావు పాల్గొని ప్రసంగించనున్నారు. ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు పాల్గొంటారని వర్సిటీ కల్చరల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి తెలిపారు.

హెల్మెట్‌ధారణపై అవగాహన



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం వాహనదారులకు హెల్మెట్ల వాడకంపై అవగాహన కల్పించారు. పూర్ణకుంభం సర్కిల్ వద్ద ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్ వాడకం, భద్రత తదితర విషయాలపై అవగాహన కల్పించారు. డీఎస్పీ రామకృష్ణమాచారి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు, మేయర్ శిరీష

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సూచించారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం 27వ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ బాయ్స్ రీజనల్ మీట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మేయర్ డాక్టర్ శిరీషతో కలసి జాతీయ పతాకం, స్పోర్ట్స్ జెండాలను ఆవిష్కరించారు. బెలూన్స్ ఎగురవేసి క్రీడలను ప్రారంభించారు. క్రీడల పట్ల తల్లిదండ్రులు కూడా పిల్లలను ప్రోత్సహించాలన్నారు. క్రీడలతో మానసిక ఎదుగుదల ఉంటుందని వివరించారు. మేయర్ మాట్లాడుతూ క్రీడా పోటీల్లో గెలుపోటములు సహజమని, రెండు సమానంగా భావించి సానుకూల దృక్పథంతో ముందుకెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి, టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి మహేష్‌యాదవ్, వినోద్‌రాయల్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్‌కుమార్, సాంకేతిక విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ నిర్మల్‌కుమార్ ప్రియా, ప్రిన్సిపాల్ ద్వారకానందరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్స్ నాగేశ్వరరావు, రాజీవ్, జనరల్ విభాగాధిపతి ఎస్వీ గౌరీశంకర్, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

● **తొలి రోజు పోటీల వివరాలు :** తొలి రోజు చెస్, కబడ్డీ, బాల్‌బ్యాడ్మింటన్, షటిల్, టేబుల్ టెన్నిస్(సింగిల్, డబుల్), వాలీబాల్, డిస్కస్, జావలిన్‌త్రో, అథ్లెటిక్స్, షాట్‌పుట్, లాంగ్‌జంప్, హైజంప్, త్రిపుల్‌జంప్ వంటి క్రీడాంశాల్లో లీగ్ పోటీలు నిర్వహించారు.

డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించండి



డీపీవో సుశీలదేవికి వినతిపత్రం ఇస్తున్న సర్పంచులు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలంలో డంపింగ్ యార్డులు లేకపోవడంతో చెత్త తరలింపునకు ఇబ్బందిగా మారిందని పలువురు సర్పంచులు జిల్లా గ్రామ పంచాయతీ అధికారి సుశీలదేవికి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో ఆమెను కలిసి వినతి పత్రం అందించారు. చాలా గ్రామ పంచాయతీల్లో డంపింగ్ యార్డులు లేకపోవడంతో చెత్త నిల్వలు పేరుకుపోతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ యశోద, సర్పంచులు డీవీ రమణ, జనార్దన్ యాదవ్, కోటేశ్వరరావు, వెంకటరమణ, జ్యోతి, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మెకానిక్‌లకు అండగా ఉంటాం



మెకానిక్ కుటుంబానికి సాయం అందిస్తున్న మునిరెడ్డి

తిరుపతి(రవాణా), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మెకానిక్ రంగంలో నిరంతరం శ్రమిస్తున్న వారికి అండగా ఉంటామని టూవీలర్ మెకానిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆవుల మునిరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక గాంధీ భవన్‌లో అసోసియేషన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసోసియేషన్‌లో ఏ సభ్యుడికి సమస్య వచ్చినా తాము అండగా ఉంటామని తెలిపారు. అనారోగ్యం బారినపడిన మెకానిక్ మధు, జలంధర్‌లకు అసోసియేషన్ ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10వేలు చొప్పున ఆర్థిక సహాయం అందించారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు లక్ష్మణరావు, ప్రభు, మల్లేశ్వర్, గురు ఆచారి, బాబు, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్న స్వగృహ స్వీట్స్ అధినేత



తిరుపతి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : స్వగృహ స్వీట్స్ అధినేత గోగినేని జగదీష్ లక్ష రూపాయలు చెల్లించి తెలుగుదేశం పార్టీ శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్నారు. టీడీపీ తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి సుగుణమ్మ ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు మునిశేఖర్ రాయల్, రామ్మూర్తి రాయల్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

హాస్టల్ ఎన్ఎంఆర్‌లకు టైంస్కేల్ ఇవ్వండి



సమావేశంలో మాట్లాడుతున్న రామానాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): హాస్టళ్లలో పనిచేస్తున్న ఎన్ఎంఆర్‌లకు టైంస్కేల్ వర్తింపజేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు కోరారు. యూనివర్సిటీలో శుక్రవారం కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 30 ఏళ్లుగా తక్కువ జీతాలతో యూనివర్సిటీకి హాస్టల్ ఎన్ఎంఆర్‌లు సేవ చేశారన్నారు. కానీ వారి జీవితాలు దయనీయంగా ఉన్నాయన్నారు. రిటైర్డు అయిన వారికి నయాపైసా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఎన్ఎంఆర్‌లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. గత వైసీపీ ప్రభుత్వం టైంస్కేల్ ఇస్తామని చెప్పి మోసం చేసిందని విమర్శించారు. ఈ ప్రభుత్వమైనా న్యాయం చేయాలని, లేకపోతే కార్మికులతో కలిసి ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు చలపతి, చిన్నా, చలపతి, ఏఐటీయూసీ నాయకులు రాధాకృష్ణ, రాజా, రవి, రాజశేఖర్, హాస్టల్ ఎన్ఎంఆర్ సంఘం కార్యదర్శి సుధాకర్ పాల్గొన్నారు.

కిక్కిరిసిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు




తిరుపతి, డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరం నుంచి భూములు, ఆస్తుల విలువలు పెరగనున్న నేపథ్యంలో జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ల కార్యాలయాలు క్రయ, విక్రయదారులతో కిక్కిరిసిపోతున్నాయి. జనవరి 1నుంచి ఆస్తుల విలువను పెంచేందుకు ప్రభుత్వ యంత్రాంగం కసరత్తు చేస్తోంది. దీంతో డిసెంబరు నెలలోపు రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ఈక్రమంలో శుక్రవారం తిరుపతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కొనుగోలుదారులు క్యూకట్టారు. ఒకదశలో సబ్ రిజిస్ట్రార్లకు ఊపిరితీసుకునే సమయం కూడా లేకపోవడంతో కొనుగోలుదారులకు మధ్య వాగ్వివాదం చోటుచేసున్నాయి. శ్రీబాలాజీ జిల్లాలో భూ విలువల పెంపుపై తిరుపతి అర్బన్ మార్కెట్ వాల్యూ రివిజన్ కమిటీ ఇప్పటికే సమావేశమైంది. మరో వారంలో జేసీ శుభం భన్సల్ అధ్యక్షతన కమిటీ సమావేశం కానుంది. రిజిస్ట్రేషన్ విభాగం ప్రతిపాదించిన ధరలను కమిటీ అంగీకారంతో పాటు ప్రజల నుంచి పెద్దఎత్తున అభ్యంతరాలు లేకపోతే కొత్త సంవత్సరంలో కొత్త ధరలు అందుబాటులోకి వస్తాయి.

అంబేడ్కర్ గురుకులాల్లో
మరమ్మతులకు రూ.90 లక్షలు

తిరుపతి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా సంవత్సరంలో నిర్వహణ గ్రాంటు కింద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో మరమ్మతులు చేపట్టేందుకు తిరుపతి, చిత్తూరు జిల్లాలకు ప్రభుత్వం రూ.90 లక్షలు మంజూరు చేసింది. పుత్తూరు గురుకులంలో తలుపులు, కిటికీల మరమ్మతులకు రూ.10 లక్షలు, చిల్లకూరు, వాకాడులో మరుగుదొడ్లు, మురుగునీటి కాలువల మరమ్మతులకు రూ.పదేసి లక్షల వంతున రూ.20 లక్షలు, నాయుడుపేటలో డార్మిటరీ రెండవ బ్లాక్, బ్లాక్ టూ తరగతి గది మరమ్మతులకు రూ.10 లక్షలు.. మొత్తం రూ. 40 లక్షలు మంజూరైంది. చిత్తూరు జిల్లాలో కుప్పం, చిత్తూరు, విజయపురం గురుకులాలకు రూ. 10 లక్షలు వంతున, రామకుప్పం గురుకులానికి రూ. 15 లక్షలు, పూతలపట్టు గురుకులానికి రూ.5 లక్షలు చొప్పున 50 లక్షలు మంజూరైంది.

సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్ 2లోని 19 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1 లో 4కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

బుధవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.60 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 58,165

తలనీలాలు సమర్పించినవారు: 20,377

WORLD SAREE DAY



కోక..మన కోక!

చీర.. భారతీయ సంప్రదాయ చిహ్నమే కాదు. ట్రెండీ కూడా. అందుకే ప్రపంచ వ్యాప్తంగా ఇప్పుడు ఆడవాళ్లు చీరల మీద మోజు పడుతున్నారు. మనదేశంలో ప్రాంతాన్ని బట్టీ చీర కట్టులో తేడాలుంటాయి. తాజాగా తొడుక్కునే చీరలు మార్కెట్‌లో కనిపిస్తున్నాయి. ఏ పెళ్లిలో అయినా చీరల తళుకులే ప్రత్యేక ఆకర్షణ. చీరంటే ఇప్పుడు.. ఒంటికి చుట్టుకునే వస్త్రం ఎంత మాత్రం కాదు. అందాన్ని పెంచే ఫ్యాషన్! అందుకే చీరలకూ ఒక ప్రత్యేక పండుగ దినాన్ని నిర్ణయించారు. దేశంలో ట్రెండీగా ఉన్న లేటెస్ట్ డిజైన్డ్ చీరలకు తిరుపతి జిల్లా కేంద్రంగా ఉంది. వెంకటగిరి కాటన్, నారాయణవనం పట్టు, కాళహస్తి కలంకారీ, మన్నారుపోలూరు సరిగ చీరలు చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, ముంబై నగరాల్లో రెపరెపలాడుతున్నాయి. ఒకప్పుడు సంప్రదాయ చీరలకే పరిమితమైన ఈ ప్రాంతాలు మారుతున్న అభిరుచులకు అనుగుణంగా డిజైన్లు మార్చుకున్నాయి. తిరుపతి నగరంలో అయితే మగ్గం వర్క్ చీరలు హల్‌చల్ చేస్తున్నాయి.





రాణులు మెచ్చిన వెంకటగిరి చీర

ఒకప్పుడు రాణులకే పరిమితమైన వెంకటగిరి చీర ఇప్పుడు పేదలకూ అందుబాటులోకి వచ్చింది. నూరవ నెంబరు స్వచ్ఛమైన కాటన్ నూలుతో నేసే ఈ చీరకే దేశ విదేశాల్లో పేరుంది. క్రీ.శ. 1700 నుంచీ వెంకటగిరి చీర ప్రస్తావన పలు చోట్ల కనిపిస్తుంది. వెంకటగిరిని ఏలిన వెలుగోటి వంశస్థులు ఇక్కడి చేనేతను ప్రోత్సహించారు. పిఠాపురం, బొబ్బిలి ఆస్థానాలకు కూడా వెంకటగిరి చేనేత చీరలు వెళ్లేవి. వెంకటగిరి చీరకు 1999లో జీఐ గుర్తింపు కూడా లభించింది. నీతూ అంబానీ, ప్రసిద్ధ సినీతారలు మెచ్చే చీరలుగా వీటికి గుర్తింపు లభించింది. మేలైన నూలుతో నేసే చీరలు కావడం వల్ల వయసు మీరిన వారికి కూడా కట్టుకుంటే తేలికగా ఉండడం వెంకటగిరి చీరల ప్రత్యేకత. నిరంతరం కొత్త డిజైన్లు ఇక్కడ తయారవుతుంటాయి. ఆధునిక సాంకేతికత ఇందుకు ఉపయోగపడుతోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో వెంకటగిరి చీరలకు మంచి గిరాకీ ఉంది. ఏటా పదివేలకు పైగా చీరలు వెంకటగిరి మగ్గాల నుంచి తయారవుతున్నాయి. విభిన్నమైన డిజైన్‌లతో చీరలు నేసిన 11 మంది వెంకటగిరి నేత కళాకారులకు రాష్ట్రపతి అవార్డులు లభించడం విశేషం.

-వెంకటగిరిటౌన్, ఆంధ్రజ్యోతి

లేటెస్ట్ ట్రెండ్

- జాంధాని వర్క్ చీరలు. చీరంతా డిజైన్ ఉండే వీటిని నేయడానికి వారంనుంచి నెల రోజులు కూడా పడుతుంది. వీటి ధరలు రూ. రెండు వేల నుంచి రెండు లక్షల దాకా ఉంటాయి.
- పూర్తి కాటన్ చీరలు రూ. 500 నుంచీ కూడా ఇక్కడ లభిస్తాయి.



నారాయణవనం పట్టు స్టయిలే వేరు

చీరల్లోనూ పట్టుచీరల మీద ఉండే మోజు వేరే! అందుకే నారాయణవనం పట్టుచీరలకు అంత డిమాండ్. సింగిల్ త్రెడ్, డబుల్ త్రెడ్, వెండి జరీ, బంగారు జరీ చీరలను ఇక్కడ నేస్తారు.ఒకప్పుడు పూర్తిగా చేనేత చీరలే ఉండేవి. కాలక్రమంలో మరమగ్గాల మీద నేయడం మొదలు పెట్టారు. లతలూ పూలే కాకుండా దేవతా ప్రతిమల చిత్రాలతో కూడిన చీరలు నేయడం నారాయణవనం ప్రత్యేకత. ఈ చీరలు తక్కువ బరువు ఉండడంతో ఎక్కువ మంది ఇష్టపడతారు. ఇప్పటికీ 50 కుటుంబాలు వారసత్వంగా నారాయణవనంలో చీరల నేతనే వృత్తిగా కొనసాగించడం విశేషం. చెన్నై, బెంగులూరు, కంచిలకు నారాయణవనం చీరలు పంపుతారు.

- నారాయణవనం, ఆంధ్రజ్యోతి

లేటెస్ట్ ట్రెండ్

- ఇమిటేట్ పట్టు మీద పోస్టర్ డిజైన్ చీరలను ఎక్కువగా ఇష్టపడుతున్నారు. చీరంతా డిజైన్ నిండి ఉండడం వీటి ప్రత్యేకత. వీటి ధరలు రూ. 5 వేల నుంచి 60 వేల దాకా ఉన్నాయి.
- నారాయణవనంలో నేసే ఇతర చీరలు డిజైన్‌ను బట్టీ రూ. 7500 నుంచి రెండు లక్షల దాకా ఉంటాయి.



ఎత్నిక్ ఫ్యాషన్ కాళహస్తి కలంకారీ

ఆలయకళగా ఒకప్పుడు ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తి కలంకారీ.. ఇప్పుడు వస్త్ర ప్రపంచంలో లేటెస్ట్ ఫ్యాషన్‌గా మారింది. వయ్యారాల వొంపులు తిరిగే పూలూ, లతలతో కూడిన డిజైన్ చీరలకు డిమాండ్ ఎక్కువ. పౌరాణిక ఘట్టాలను రాసిన కలంకారీ చీరల కోసం సంపన్న మహిళలు పోటీ పడుతుంటారు. బ్లాక్ ప్రింటింగ్, స్క్రీన్ ప్రింటింగ్‌తో ఉన్న కలంకారీ చీరలు మార్కెట్‌ను ముంచెత్తుతున్నా శ్రీకాళహస్తి పెన్ కలంకారీకి ఉన్న డిమాండ్ తరగనిది. చేత్తో బొమ్మ గీసి, లతలూ పూల డిజైన్లు రాసి, వాటికి ఒక్కో దశలో ఒక్కో రంగు అద్దుతూ చేసే కళాత్మక ప్రక్రియ ఇది. చెట్ల ఆకులూ, వేర్లతో కూడిన సహజసిద్ధమైన రంగులే శ్రీకాళహస్తి కలంకారీ చీరలకు ఎక్కువగా వాడుతారు. శ్రీకాళహస్తిలో 35 కలంకారీ యూనిట్లు ఉన్నాయి. వందలాదిమందికి ఇవి ఉపాధి చూపుతున్నాయి. ఏటా శ్రీకాళహస్తి నుంచి 60 నుంచి 70వేల కలంకారీ చీరలు ఉత్పత్తి అవుతున్నట్లు అంచనా.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి





లేటెస్ట్ ట్రెండ్

- జరీ అంచున్న కంచిపట్టు చీర మీద కలంకారీ డిజైన్ రాసిన చీరలకు ఇప్పుడు డిమాండ్ ఉంది. వీటి ధర రూ.20వేలనుంచి రూ.30వేల దాకా ఉంటుంది.
- టస్సర్, టిస్యూ, బెంగళూరు సిల్క్, చందేరి సిల్క్, మదనపల్లి పట్టు, మంగళగిరి సిల్క్, క్రేప్ క్లాత్, లెనిన్‌క్లాత్, కోట సిల్క్ చీరల మీద కలంకారీ డిజైన్లు ధరించేందుకు మహిళలు ఆసక్తి చూపుతున్నారు. వీటి ధర రూ.10వేలు నుంచి రూ.20వేల వరకు ఉంది.

పోలూరు సరిగ చీరలు



సూళ్లూరుపేట సమీపంలోని మన్నారుపోలూరు సరిగచీరలు ప్రత్యేకమైనవి. చేనేత నుంచి మరమగ్గాలకు ఎక్కువగా మారిపోయినా ఇప్పటికీ సంప్రదాయంగా ఇక్కడ చేనేత చీరలు కూడా తయారవుతున్నాయి. అయిదు రకాల చీరలు మన్నారుపోలూరులో నేస్తారు. పడగూ, పేకా కూడా పట్టు నూలు కలిగిన పూర్తి పట్టు చీరలు, కాటన్‌పై పాలిస్టర్ చీరలు, కాటన్‌పై పట్టు, జరీ బాండ్ చీరలు , సాధారణ కాటన్ చీరలు ఇక్కడ తయారవుతాయి. తరాలుగా ఇక్కడ వందలాది కుటుంబాలు చేనేతనే జీవనాధారం చేసుకున్నాయి. కంచి, ఆరణి లకు ఈ చీరలు పంపుతారు.

-సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి

లేటెస్ట్ ట్రెండ్

- మన్నారుపోలూరులో నేసే గ్రాఫికల్ డిజైన్ పట్టు చీరలను తాజాగా ఇష్టపడుతున్నారు. జరీ బార్డర్, బుటా, నిండు డిజైన్‌గల కొంగు.. ఈ చీరల ప్రత్యేకత. వీటి ధరలు రూ.1500 నుంచి 15 వేల దాకా ఉన్నాయి.



మగువలు మెచ్చే మగ్గం డిజైన్స్

నగరంలో ట్రెండ్ మగ్గం వర్క్ చీరలు. పెళ్లిళ్లలో ఇవే హైలెట్. కోరిన డిజైన్లను కోరిన రంగు మీద, నచ్చిన క్లాత్‌పై కుట్టించుకోవచ్చు. మెషీన్ ఎంబ్రాయిడరీ తోనూ ఇవి తయారవుతాయి కానీ, ధర ఎక్కువే అయినా చేతి పనికే డిమాండ్ ఎక్కువ. తిరుపతిలో 500 మగ్గం సెంటర్లు ఉన్నాయంటేనే ఈ రకం చీరలపై మహిళలకున్న మోజు ఎలాంటిదో అర్థం అవుతుంది. వివిధ రంగుల దారాలతో పాటూ చమ్కీలు, జరీ, అద్దాలు కూడా డెకొరేటివ్‌గా కుడతారు. నెట్‌లో ఎంపిక చేసుకున్న డిజైన్ ఫోటోలు చూపి అలా కుట్టించుకునే సౌలభ్యం ఉండడం దీని ప్రత్యేకత.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

లేటెస్ట్ ట్రెండ్

ఆన్‌లైన్ డిజైన్స్‌ను ఎక్కువగా ఇష్టపడుతున్నారు. చీర వారే తెచ్చుకుంటారు. డిజైన్‌ను బట్టీ ఒక్కో చీరకు రూ. రెండు వేల నుంచీ ఇరవై వేల దాకా మగ్గం పనికే తీసుకుంటారు. ఈ చీరలు మార్కెట్‌లో లక్ష దాకా పలుకుతాయి.



ఘనంగా అమరరాజా 39వ వ్యవస్థాపక దినోత్సవం



రేణిగుంట, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలంలోని అమరరాజా పరిశ్రమలో శుక్రవారం 39వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమరరాజా సంస్థల చైర్మన్ గల్లా జయదేవ్ మాట్లాడుతూ.. 1985లో అమరరాజా పవర్ సిస్టమ్‌గా కార్యకలాపాలు ప్రారంభించిన గ్రూప్ ఇప్పుడు ఆరు కంపెనీలు, 17 వ్యాపారాలతో 18,500కుపైగా ఉద్యోగులను కలిగి ఉందన్నారు. అనంతరం ఎంపిక చేసిన ముగ్గురు గ్రామీణ పారిశ్రామికవేత్తలకు రూ.3లక్షల నగదు పురస్కారాన్ని అందించారు. అమర రాజాకు చెందిన మార్కెటింగ్ హెచ్ఆర్, ఫైనాన్స్, సప్లై చెయిన్ సీఎక్స్‌వోలకు సంవత్సరం మెంటార్‌షిప్ అందించారు. ఎంబిటీ తొలి అంతర్జాతీయ అంధ విద్యార్థి శ్రీకాంత్ బొల్లా తన స్ఫూర్తిదాయకమైన ప్రయాణాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో అమరరాజా పరిశ్రమ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ గల్లా రామచంద్ర నాయుడు, మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, డాక్టర్ రమాదేవి గౌరినేని, హర్షవర్ధన్ గౌరినేని, విక్రమాదిత్య, సిద్ధార్థ్ గల్లా, గ్రూప్ ఆపరేషన్ హెడ్ నరసింహులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మ్యారిటైమ్ బోర్డుకు 'పులికాట్' పనులు

తిరుపతి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పులికాట్ సరస్సు అభివృద్ధి పనులను రాష్ట్ర ప్రభుత్వం ఏపీ మ్యారిటైమ్ బోర్డుకు అప్పగించింది. జిల్లాలోని తడ, సూళ్ళూరుపేట, దొరవారిసత్రం, వాకాడు మండలాల పరిధిలో సరస్సు వున్న సంగతి తెలిసిందే. తమిళనాడు పరిధిలోని సరస్సులో సముద్ర ముఖ ద్వారాలకు తరచూ పూడిక తీస్తున్నారు. జిల్లా పరిధిలో మాత్రం గత ప్రభుత్వాలు విస్మరించడంతో ఇక్కడి సముద్ర ముఖద్వారాలన్నీ పూడిపోయాయి. సముద్రపు నీరు సరస్సులోకి రాకపోవడంతో సముద్ర రకాల చేపలు, రొయ్యలు, ఇతర రకాల మత్స్య సంపద ఇక్కడ అభివృద్ధి చెందడం లేదు. వీటిపై ఆధారపడ్డ మత్స్యకార కుటుంబాలు తమ పరిధి దాటి చేపల వేటకు వెళ్లాల్సి రావడంతో తరచూ తమిళనాడు జాలర్లతో సరిహద్దు తగాదాలు తలెత్తుతున్నాయి. ఈ క్రమంలో గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు సముద్ర ముఖద్వారాల పూడిక తీతకు రూ. 97 కోట్లు కేటాయించారు. వాకాడు మండలం పూడిరాయి దొరువు వద్ద చేపట్టాల్సిన ఈ పనులను ఏపీ మ్యారిటైమ్ బోర్డుకు అప్పగిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఆవిష్కరణలకు దిక్సూచిగా ఏపీ

- సీఐఐ రాష్ట్ర చైర్మన్ మురళీకృష్ణ
- వర్చువల్‌గా మాట్లాడిన సీఎస్ నీరబ్

తిరుపతి, డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): ఆవిష్కరణలకు దిక్సూచిగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తుందని సీఐఐ ఏపీ చైర్మన్ డాక్టర్ వి.మురళీకృష్ణ అన్నారు. తిరుపతిలో శుక్రవారం జరిగిన సీఐఐ (కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ) ఏపీ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ కాన్ క్లేవ్‌లో దార్శనిక నాయకులు, ఆవిష్కర్తలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పాల్గొని సుస్థిర వృద్ధికి ఉన్న అవకాశాలను అన్వేషించారు. ప్రారంభ సెషన్‌లో మురళీకృష్ణ స్వాగతోపన్యాసం చేస్తూ అభివృద్ధిని ప్రోత్సహించడానికి అపారమైన ప్రతిభ, వనరులను ఏపీ ఉపయోగించుకుంటుందన్నారు. అందరం కలిసి మరింత సమ్మిళిత, సృజనాత్మక, సుసంపన్న భవిష్యత్తుకు బాటలు వేద్దామని పిలుపునిచ్చారు. సదస్సుకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ వర్చువల్‌గా మాట్లాడారు. సరికొత్త ఆవిష్కరణలు అవసరమని, ఆదిశగా ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంసిద్ధతతో ఉన్నాయన్నారు. అరకువ్యాలీ నుంచి వస్తున్న అరబిక్ కాఫీ, ఇటీవల ఆవిష్కృతమైన సెలైన్ వాటర్ లాంథర్ గురించి ప్రస్తావించారు. ఐఐటీ తిరుపతి డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎన్.సత్యనారాయణ మాట్లాడుతూ.. విజ్ఞాన ఆధారిత సహకారాలను సృష్టించడంలో ఉన్నత విద్యా సంస్థలు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. రాష్ట్ర విభజన సమయంలో రెండు, మూడు కేంద్ర విద్యా సంస్థలు మాత్రమే ఉండగా నేడు చాలా వచ్చాయన్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానం సాయంతో స్టార్టప్ బిజినెస్ అభివృద్ధి కోసం ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉందన్నారు. బలమైన ఎకోసిస్టమ్స్, స్టార్టప్‌లకు తిరుపతిలో ఉన్న ప్రయోజనాలను వివరించారు. తిరుపతిలో బలమైన పర్యావరణ వ్యవస్థను నిర్మించడానికి అందుబాటులో ఉన్న అనేక పథకాలను పరిశ్రమలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీఐఐ తిరుపతి జోన్ చైర్మన్ పుష్పిత్ గార్గ్ మాట్లాడుతూ సృజనాత్మకత సంస్కృతిని పెంపొందించడం ద్వారా ఏపీలో సుస్థిర భవిష్యత్తును నిర్మించవచ్చన్నారు. సుస్థిరాభివృద్ధికి కేంద్రంగా మారడానికి తిరుపతికి అపారమైన సామర్థ్యం ఉందని సీఐఐ ఆంధ్రప్రదేశ్ మాజీ చైర్మన్ విజయ్ నాయుడు గల్లా వివరించారు. సుస్థిర అభివృద్ధికి తోడ్పడేందుకు ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్స్ అవసరాన్ని ఎన్ఆర్‌డీసీ సీనియర్ రీజినల్ మేనేజర్, డబ్ల్యూఐపీవో టెక్నాలజీ ఇన్నోవేషన్ సెంటర్ హెడ్ డాక్టర్ బిజయ్ కుమార్ సాహు స్పష్టం చేశారు. డిజిటల్ టెక్నాలజీ కన్సల్టెంట్, ఐటీటీ మాజీ రీజినల్ డైరెక్టర్ సునీల్ డేవిడ్ మాట్లాడుతూ కర్ణాటక తరహాలో ప్రతి రాష్ట్రానికి తమ బ్రాండ్ కాఫీని కస్టమైజ్ చేసినట్లుగా డైనమిక్స్ ఉన్నాయన్నారు. తిరుపతిలో 50కి పైగా ఐటీ కంపెనీలు, 10కి పైగా ఎమ్మెన్సీ కంపెనీలు ఉన్నాయని టెక్నాలజీ కంపెనీస్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (టీసీఏఏపీ) అధ్యక్షుడు వంశీకృష్ణ రాయల్ తెలిపారు. తిరుపతికి ఉన్న ఉత్తమ అవకాశాల్లో శ్రీసిటీ ఒకటన్నారు. అనంతరం జరిగిన చర్చల్లో విద్య, వైద్యం, మార్కెటింగ్ వంటి రంగాలకు సంబంధించి ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సందేహాలను ప్యానెల్ సభ్యులు నివృత్తి చేశారు.



రికార్డులు దహనంచేసి భూముల కబ్జా

- వైసీపీ పాలనలో అక్రమాలపై ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

రేణిగుంట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో రెవెన్యూ రికార్డులను దహనంచేసి ప్రభుత్వ భూములను కబ్జా చేశారని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. దీంతో తమకు ఇష్టమొచ్చినట్లుగా ఆన్‌లైన్‌లో పేర్లు మార్చుకుని భూములు కాజేశారన్నారు. రేణిగుంట మండలం అన్నాసామిపల్లెలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు నల్లకోటును అడ్డుపెట్టుకుని చేసిన భూదందాను వెలికి తీస్తామన్నారు. ప్రభుత్వ భూమిలో బంగ్లా నిర్మించుకుని నివాసం ఉండడాన్ని గుర్తించినట్లు తెలిపారు. సూరప్పకశం, కొత్రమంగంశం లతోపాటు ఈ గ్రామంలోని సర్వే నెం. 385, 341/1, 342/3, 343/3, 338/1, 2, 334, 335లలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైనట్లు గుర్తించామన్నారు. అన్నాస్వామిపల్లెలో భూములను రీసర్వే చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. త్వరలోనే కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని, ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఆలయాన్నీ వదల్లేదు

మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ముక్కంటి ఆలయాన్నీ వదలకుండా దోచుకున్నారని సుధీర్‌రెడ్డి విమర్శించారు. జగనన్న కాలనీల కోసం స్థలసేకరణలో అగ్రిమెంట్లు చేసుకుని కేవలం రూ.7లక్షలు వంతున రైతులకు చెల్లించి ప్రభుత్వం నుంచి రూ.45 కోట్లు కొట్టేశారన్నారు. శ్రీకాళహస్తి రాజీవ్‌నగర్ కాలనీలో అక్రమ నిర్మాణాల తొలగింపులో కనిపించని మాజీ ఎమ్మెల్యే.. స్వర్ణముఖి నది ఒడ్డున ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులను అడ్డుకోవడంలో అంతర్యమేమిటో చెప్పాలన్నారు. వైసీపీ పాలనలో కొంత మంది రేణిగుంట పరిసరాల్లో ఆక్రమిత భూముల్లో ప్లాట్లు వేసి విక్రయించారన్నారు. ఇలాంటి ప్లాట్లు కొనవద్దని తాను అప్పట్లో చెప్పానని గుర్తుచేశారు. ఎవరైనా వీటిని కొని నష్టపోతే అందుకు వైసీపీ నాయకులే బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో భానుప్రకాశ్‌రెడ్డి, తహసీల్దారు సురేష్ బాబు, ఎంపీడీవో విష్ణు చిరంజీవి, అధికారులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



2018కి ముందు, తర్వాత కబ్జా భూముల్లో తేడాలకు సంబంధించి శాటిలైట్ చిత్రాలను చూపుతున్న ఎమ్మెల్యే సుధీర్

పోక్సో కేసులో నలుగురికి పదేళ్ల జైలు

నెల్లూరు (లీగల్), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఓ బాలికను ప్రేమించానని నమ్మించి ఆమెపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తితోపాటు అందుకు సహకరించిన మరో ముగ్గురికి పదేళ్ల జైలు శిక్ష, రూ.22 వేల జరిమానా విధిస్తూ నెల్లూరు జిల్లా పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి సుమ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు...ఓజిలి మండలం ఇనగుంట గ్రామానికి చెందిన దండోలు సుబ్బారావు అలియాస్ సుబ్బు 10వ తరగతి చదువుతున్న ఓ బాలికను ప్రేమ, పెళ్లి పేరుతో నమ్మించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీనిపై బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడికి బుచ్చినాయుడు కండ్రిగ మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన కోగిలి సుబ్రహ్మణ్యం, ఓజిలి మండలం ఇనగుంట గ్రామానికి చెందిన ఎల్లంటి వెంకటయ్య, బాలాయపల్లి మండలం జయంపు గ్రామానికి చెందిన మంగళూరు వాణి సహకరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఓజిలి పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో నిందితులు ఒక్కొక్కరికి పదేళ్ల చొప్పున జైలు శిక్ష, 22 వేల రూపాయల వంతున జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు.

ఢిల్లీలో ఎంఎస్ఎంఈ వర్క్‌షాప్

శ్రీకాళహస్తి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో ఎంఎస్ఎంఈ అడిషనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ అశ్వినిలాల్ ఆధ్వర్యంలో వర్క్‌షాప్ జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దశరథాచారి పాల్గొన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్యంతర, భారీ పరిశ్రమల అభివృద్ధి, ప్రోత్సాహం, మార్కెటింగ్, జీఈఎం రిజిస్ట్రేషన్, గవర్నమెంట్ సబ్సిడీ, నాణ్యత అంశాలు, ఎగుమతి, క్లస్టర్ వంటి వాటిపై చర్చించారు. అనంతరం అశ్వనిలాల్‌ను కలిసి రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు రాయితీలిచ్చి ప్రోత్సహించాలని ఆయన కోరారు.



పుత్తూరు వార్తలు

ఘనంగా ప్రారంభమైన
రాష్ట్రస్థాయి బాలికల ఖోఖో పోటీలు



ఖోఖోలో తలపడుతున్న జట్లు

పుత్తూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాలికల అండర్ 19 ఖోఖో పోటీలు శుక్రవారం పుత్తూరు పట్టణంలోని ప్రభుత్వ ఎస్‌ఆర్‌ఎస్ జూనియర్ కళాశాల మైదానంలో ఘనంగా ప్రారంభమైనాయి. మూడు రోజుల పాటు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీలను పుత్తూరు ఉప విద్యాశాఖాధికారి ప్రభాకర్‌రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చదువుతో పాటు క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహాన్ని విద్యార్థులు అంది పుచ్చుకుని ఎదగాలని ఆకాంక్షించారు. ప్రపంచ చెస్ ఛాంపియన్ అయిన గుకేష్ జిల్లావాసి కావడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో జయరామయ్య, రఘుపతి, ఏకాంబరాచ్చారి, ఈశ్వర్‌నాయక్, బాబు, బాలాజీ పాల్గొన్నారు.

ఆర్‌ఓఆర్ కోసం వినతులు

పుత్తూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని చెర్లోపల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆర్‌ఓఆర్‌కు 18 వినతులు, ఇళ్లపట్టాలకు 4, 22ఏకు అర్జీ వచ్చినట్టు తహసీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు జీవరత్నం నాయుడు, ప్రసాదనాయుడు, రెవెన్యూ అధికారులు తిరుమలసాయి, శేషమరా తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణ కోసం ...

పాదిరేడు బైపాస్ వద్ద హైమాస్ట్ విద్యుత్ దీపాల ఏర్పాటు



పాదిరేడు బైపాస్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్

వడమాలపేట, డిసెంబర్ 20(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి కూడళ్లలో రోడ్డు ప్రమాదాల నివారణ కోసం హైమాస్ట్ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. తిరుపతి-చెన్నై జాతీయ రహదారి వడమాలపేట మండలం పరిధిలో పాదిరేడు బైపాస్ రోడ్డు వద్ద పలు రోడ్డు ప్రమాదాల్లో పలువురు మృతి చెందగా కొంతమంది గాయపడ్డారు. ఈ విషయమై విద్యుద్దీపాలు ఏర్పాటు చేయించాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌కు స్థానికులు విన్నవించారు. దీంతో జాతీయ రహదారి అధికారులతో ఆయన మాట్లాడారు. ఎన్‌హెచ్ అధికారులు స్పందించి పాదిరేడు బైపాస్, తడుకు ఆర్‌ఎస్ కూడళ్ల వద్ద హైమాస్ట్ విద్యుత్ దీపాలను శుక్రవారం ఏర్పాటు చేశారు. అలాగే కదిరిమంగళం కూడలి వద్ద కూడా త్వరలో ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు చెప్పారు.

పల్లె రోడ్లకు మహర్దశ



సిమెంటు రోడ్డు నిర్మిస్తున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మాజీ సర్పంచు బొబ్బిలి యాదవ్, పీడీ శ్రీనివాస ప్రసాద్, ఎంపీడీవో రమేష్‌బాబు

పుత్తూరు టౌన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వంలో పల్లె రోడ్లకు మహర్దశ వచ్చిందని తడుకు సర్పంచు బొబ్బిలి యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం పంచాయతీలోని ఎగువ గూళూరులో నిర్మించనున్న సిమెంటు రోడ్డును ఉపాధి హామీ పీడీ శ్రీనివాస ప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా బొబ్బిలి యాదవ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా గ్రామాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఎంపీడీవో రమేష్‌బాబు, ఏపీడీ సరిత తదితరులు పాల్గొన్నారు.

దేశ ప్రజలకు అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

పుత్తూరు టౌన్, డిసెంబర్ 20(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అవమానించడం సరికాదని దీనిపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కేవీపీఎస్, అంబేడ్కర్ ట్రస్ట్, డీహెచ్‌పీఎస్ సహా పలు దళిత సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దళిత సంఘ నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక మతోన్మాదాన్ని పెంచి పోషిస్తోందన్నారు.అపరంజి, కుప్పయ్య, మహేష్, వెంకటేష్, గుణశేఖర్, వడివేలు, విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఘనంగా గంధ మహోత్సవం



గంధ మహోత్సవంలో టీడీపీ నాయకులు

పుత్తూరు టౌన్, డిసెంబర్ 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గేటు పుత్తూరు ఆనంబట్టు రోడ్డులో నాగూర్ ఖాదరవల్లి దర్గాలో గంధ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్సవానికి టీడీపీ నాయకులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గంధ మహోత్సవం మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని కొనియాడారు. చిత్తూరు పార్లమెంట్ టీడీపీ మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి మహ్మద్ నబీ, ముస్లిం మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఖాజాపీర్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్‌ఎన్ ధనపాల్, నాయకులు డీఎస్ ఎళుమలై, రావిళ్ల మాధవనాయుడు, కేశవచ్చారి, హరి, శ్రీరాం, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టాలమ్మ సేవలో ప్రవాస భారతీయులు



ప్రవాసభారతీయులుకు సన్మానం

వరదయ్యపాళెం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంత వేలూరు గ్రామదేవత పుట్టాలమ్మను టెక్సస్‌లో స్థిరపడ్డ ప్రవాస భారతీయుడు, రోబోటిక్ హార్ట్ సర్జన్ అమిత్ కిషోర్, ఆయన బృందం శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన ఆలయానికి రూ.లక్ష విరాళం అందజేశారు. ఆలయ వ్యవస్థాపకుడు, అమెరికా పౌరుడు డాక్టర్ మాయాని చెంచుమునస్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

స్వర్ణముఖినదిలో గుర్తుతెలియని మృతదేహం

నాయుడుపేట టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్వర్ణముఖినది తీరాన గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. పోలీసుల కథనం మేరకు... శుక్రవారం సాయంత్రం యువకులు స్వర్ణముఖివద్దకు వెళ్లగా శ్మశానవాటికకు సమీపంలో గుర్తుపట్టలేని విధంగా ఉన్న మృతదేహాన్ని గమనించిన పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. గుర్తుపట్టలేని విధంగా ఉండటంతో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య

నాయుడుపేట టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అమరా గార్డెన్‌లో నివాసం ఉంటున్న చిరంజీవి(43) కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... శుక్రవారం సాయంత్రం కుటుంబసభ్యులు లేని సమయంలో చిరంజీవి ఉరివేసుకొని మృతి చెందాడు. ఇంటికి వచ్చాక గమనించిన కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని చిరంజీవి మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంటల బీమాకు నమోదు చేసుకోండి

పెళ్లకూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో పంట రుణం పొందిన రైతులందురూ బీమా నమోదు చేసుకోవాలని పెళ్లకూరు బ్రాంచ్ మేనేజర్ నాగాంజనేయులు తెలిపారు. రబీలో సాగు చేసే వరికి రూ.630 ప్రీమియం చెల్లించి ఈనెల 31లోగా బీమా నమోదు చేసుకోవాలని సూచించారు. బీమా అవసరం లేని రైతులు 24లోగా బ్యాంకు సిబ్బందికి తెలియజేయాలని, లేకుంటే రైతుల ఖాతా నుంచి రూ.630 మినహాయించుకోవడం జరుగుతుందన్నారు.

దుస్థితిలో పార్కులు

- పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు
- గంజాయి, మందుబాబుల అడ్డా
- పట్టించుకోని అధికారులు





పోలిశెట్టిగుంట పార్కులో అధ్వానంగా ఉన్న చిన్నారి ఆట వస్తువు - కుమ్మరిగుంట పార్కులో విరిగిన బెంచీలు

వెంకటగిరి టౌన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): క్షణం తీరిక లేని పనులతో నిత్యం మానసిక ఒత్తిడికి గురవుతున్న నేపథ్యంలో సాయంత్రం వేళ కాసింత ఆహ్లాదకరమైనా వాతావరణంలో గడపాలని ప్రతి ఒక్కరికీ ఎంతో ఆపేక్ష ఉంటుంది. అయితే వెంకటగిరి పట్టణంలో పార్కులు అనువుగా లేకపోవడం వల్ల స్థానికులు ఆహ్లాదకర వాతావరణానికి దూరమవుతున్నారు. పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని పంచిపెట్టిన పార్కుల నిర్వాహణ కోసం మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో నిరుపయోగంగా మారాయి. చిన్నారులకు ఆట, పాటలు, పెద్దలు ఉదయం, సాయంత్రం వాహ్యాళికి ఉపయోగపడిన పార్కులు దుస్థితికి చేరుకున్నాయి. వెంకటగిరి పట్టణానికి మున్సిపాలిటీ హోదా లభించిన కొత్తలో కుమ్మరిగుంట వద్ద రూ.10లక్షలు ఖర్చు చేసి పార్కు నిర్మించారు. కుమ్మరిగుంటలో కొంత కాలం బోటు షికారు ఏర్పాటు చేశారు. అనంతరం నిర్వహణ లోపం వల్ల బోటు షికారు ఆపేయగా ప్రస్తుతం పార్కు కూడా దుస్థితిలో ఉంది. కూర్చునేందుకు ఏర్పాటు చేసిన బల్లలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ముళ్లపొదలు, చెట్లు పెరిగిపోవడం మద్యం ప్రియులకు అడ్డాగా మారింది. దీంతో చదువుకునేందుకు వచ్చే విద్యార్థులు కూడా పార్కుకు రావడంతో మానేశారు. అలాగే పోలిశెట్టి గుంట వద్ద రూ.20లక్షలతో మరో పార్కు ఏర్పాటు చేశారు. అయితే పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయకపోవడంతో నిరుపయోగంగా మిగిలిపోయింది. బల్లలు, చిన్నారులు ఆడుకునే వస్తువులు విరిగి పోవడంతో ఎవరూ రావడం లేదు. గంజాయి, మందుబాబులు సంచరిస్తుండడంతో పార్కుకు వెళ్లేందుకు భయపడుతున్నారు. సమీపంలో పాఠశాలలు, కాళశాలలు ఉన్నాయని, మద్యం, గంజాయి వినియోగదారులను కట్టడి చేసేందుకు పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. మున్సిపల్ అధికారులు చొరవతీసుకుని పార్కులను అభివృద్ధి చేసి వినియోగంలోకి తీసకురావాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

పేదల భూములను ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదు: పాశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

చిల్లకూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): పేదల భూములను ఎవరైనా ఆక్రమిస్తే ఉపేక్షించేదిలేదని, ఎంతటివారైనా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని చింతవరం గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ గ్రామంలో పేదలకు చెందిన 112 ఎకరాల భూమిని పెద్దలు ఆక్రమించున్నారన్నారు. ఆ భూములను తిరిగి పేదలకు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్టును ప్రవేశపెట్టి పేదల భూములకు రక్షణ లేకుండా చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ల్యాండ్ గ్రాబింగ్ యాక్టు తీసుకొచ్చి పేదల భూములకు రక్షణ కల్పించిందన్నారు. గ్రామంలో జమీందారి వ్యవస్థకు స్వస్థి పలికి పనిచేసే నాయకులకు పట్టం కట్టాలన్నారు. అప్పుడే గ్రామం అభివృద్ధి చెందుతుందన్నారు. పార్టీలకు అతీతంగా పేదలందరికీ ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు, రేషన్‌కార్డులు వంటివి మంజూరు చేయడంతో పాటు ప్రభుత్వ పథకాలు అందించడం జరుగుతుందన్నారు. గ్రామంలో జలజీవన్ మిషన్ ద్వారా రికార్డుల ప్రకారం 99 కొళాయి కనెక్షన్లు ఉండగా, వాస్తవంగా 20 కూడా లేవని స్థానికులు తెలిపారు. గ్రామంలోని దళితవాడలో తాగునీటి సమస్య పరిష్కరించాలని,నూతన పాఠశాలను నిర్మించినా, ఆ భవనానికి కాంట్రాక్టరు తాళం వేశాడని, దేవదాయశాఖ భూములు ఆక్రమణలో ఉన్నాయని, పీహెచ్‌సీలో రాత్రిపూట వైద్యులు, అవసరమైన మందులను అందుబాటులో ఉండేలా చూడాలని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎన్నికల సమయంలో వైసీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన గోపాల్‌ను ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో సన్నారెడ్డి వెంకటరమణారెడ్డి, ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, వెంకటేశ్వర్లునాయుడు, లీలావతి, చిరంజీవి, కీరవాణి, వెంకటేశ్వర్లు, శ్రీను, శంకరయ్య, వెంకటకృష్ణయ్య, సాయి, తహసల్దారు శ్రీనివాసులు, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని గాంధీనగర్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనాతో కలిసి పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దారు చంద్రశేఖర్, వెంకటేశ్వర్లురాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ బ్యాంక్ సేవలను వినియోగించుకోండి



సమావేశంలో రీజనల్ మేనేజర్ మోహన్‌రెడ్డి, బ్యాంక్ మేనేజర్ రజనీ, ఫీల్డ్ ఆఫీసర్ శ్రీను

కోట, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ సేవలను ఖాతాదారులు వినియోగించుకోవాలని ఉమ్మడి నెల్లూరు జిల్లా రీజనల్ మేనేజర్ మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కోటలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్‌ను ఆయన తనిఖీ చేశారు. బ్యాంక్‌లోని ఇంటర్నేట్ సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ బ్యాంకు తిరుపతి, ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 68శాఖలతో రూ.6,300 కోట్ల వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తోందన్నారు. కోట బ్రాంచ్‌లో రూ.48 కోట్ల వ్యాపార లావాదేవీలు జరుపుతున్నారన్నారు. ప్రగతి రూట్ టాప్ సోలార్ పథకం ద్వారా రూ.78వేల వరకు ఖాతాదారులు సబ్సిడీ పొందవచ్చాన్నారు. స్వగృహ, విద్య, రుణాలతో పాటు ప్రగతి మల్టీపర్పస్ మాట్‌గేజ్ రుణాలను ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ నెల 31వ తేదీ వరకు ఈ పథకాల కింద రుణాలు తీసుకోవచ్చన్నారు. అదేవిధంగా రుణాలు పొంది సకాలంలో చెల్లించని మొండి బకాయిదారుల కోసం వన్‌టైమ్ సెటిల్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. అలాగే ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమాయోజన, అటల్ పెన్షన్ యోజన, ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన పథకాల ఫలాలను ప్రతి ఖాతాదారుడికీ అందేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఆయన వెంట బ్యాంక్ మేనేజర్ రజనీ, ఫీల్డ్ ఆఫీసర్ శ్రీను, క్యాషియర్ నితిన్‌సాయి ఉన్నారు.

చోరీల నివారణకు ప్రత్యేక చర్యలు

పెళ్లకూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో చోరీల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇతర ప్రాంతాలకు వేళ్లేవారు ఇళ్లకు సైరన్ ఉండే తాళాలు వేసుకోవాలన్నారు. గ్రామాల్లో రాత్రి సమయంలో కొత్త వ్యక్తులు సంచరిస్తున్నట్లు అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

దారి సమస్య పరిష్కారం



ఎక్స్‌కవేటర్‌తో దారిని ఏర్పాటు చేయిస్తున్న తహసీల్దారు రామయ్య

వాకాడు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వడ్డిపాళెం గ్రామంలో ఎన్నో యేళ్లుగా నెలకొన్న దారి సమస్య రెవెన్యూ సదస్సు పుణ్యమాని పరిష్కారం అయింది. మండలంలోని కొండాపురం పంచాయతీలో శుక్రవారం తహసీల్దారు రామయ్య ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. టీడీపీ నాయకుడు తుమ్మల మోహన్ నాయుడు ఆధ్వర్యంలో గ్రామస్తులు దారి సమస్యను తహసీల్దారు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన తహసీల్దారు సంబంధిత అధికారులతో కలిసి దారిని పరిశీలించారు. అక్కడికక్కడే పరిష్కరించి ఎక్స్‌కవేటర్‌తో దారి ఏర్పాటు చేయించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. రెవెన్యూ సదస్సులో పలువురు రైతులు వివిధ సమస్యలపై 79 అర్జీలు అందజేశారని, వాటిని 45రోజుల్లో పరిష్కరిస్తామని తహసీల్దారు చెప్పారు. కార్యక్రమంలో వీఆర్వో కాటమ్మ, టీడీపీ నేత గోపీనాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులకు గుడ్డ సంచుల వితరణ

కోట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద గోవిందపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు సీతారామ ధార్మిక సేవా సంఘం ఆధ్వర్యంలో గుడ్డ సంచులను వితరణగా అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి అనంతాచార్యులు, డాక్టర్ వాకాని కృష్ణ ప్రసాద్, హెచ్‌ఎం గిరిధర్‌బాబు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతలపై దాడి హేయమైన చర్య

గూడూరు అర్బన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష నేతలపై అధికార బీజేపీ నేతలు బలప్రయోగం చేయడం హేయమైన చర్యగా గూడూరు కాంగ్రెస్ పార్టీ గూడూరు ఇన్‌చార్జి పరిమల వెంకటేశ్వరరావు అభివర్ణించారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన అభ్యంతరకర వ్యాఖ్యల ఉదంతాన్ని తప్పుదోవ పట్టించేందుకే పార్లమెంటులో ప్రతిపక్షాలను బీజేపీ నాయకులు రెచ్చగొట్టారని ఆయన విమర్శించారు. అమిత్‌షాపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

శ్మశాన దారికి స్థల పరిశీలన

సూళ్లూరుపేట, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొమ్మినేనిపల్లి, బీసీ కాలనీ, దళితవాడ శ్మశానానికి వెళ్లే దారికోసం అధికారులు శుక్రవారం స్థల పరిశీలన చేశారు. ఇటీవల సూళ్లూరుపేటలో కలెక్టర్ వెంకటేశ్వర్ నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆ గ్రామస్తులు శ్మశానికి వెళ్లేందుకు దారిలేదని ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వీఆర్వో ఉషా, సర్వేయర్ బాలాజి, సచివాలయ సిబ్బంది స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల కార్యదర్శి పాకం వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

కోట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్న రెవెన్యూ సదస్సులను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు జయ జయరావు కోరారు. మండల పరిధిలోని వైవాలదిబ్బ, పుచ్చలపల్లి, గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు జరిగాయి. కార్యక్రమంలో ఆర్‌ఐ మధులత, సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, వీఆర్వో కృష్ణయ్య, సర్వేయర్ గోపీరెడ్డి ఉన్నారు.

సూళ్లూరుపేట(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దామానెల్లూరులో ఆర్‌ఐ రాజగోపాల్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూ సమస్యలపై 12, ఇంటి స్థలం కోసం 4, శ్మశానానికి రోడ్డు నిర్మాణం కోసం 3 అర్జీలు వచ్చాయి. వీఆర్వో దివ్య నందిత పాల్గొన్నారు.

నాయుడుపేట (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - మేనకూరులో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పట్టాదారు పాసు పుస్తకాల కోసం 6 అర్జీలు, పొలాలు సర్వే చేయాలని రెండు, ఇతరుల ఆధీనంలో ఉన్న తమ పొలాలను అప్పగించాలంటూ రెండు అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే అధికారి హరిహర, ఎండోమెంట్ ఈవో రవికుమార్, ఆర్‌ఐ సాయితేజ, వీఆర్వో శ్రీనివాసులు, మౌనిక, టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ జడ్పీటీసీ శ్రీరామ్‌ప్రసాద్, సీడీసీ మాజీ చైర్మన్ కట్టా సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

బాలాయపల్లి(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిడిగల్లు, సిద్దాగుంట గ్రామాల్లో తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. పాసు పుస్తకాలు, 1బి నమోదు కోసం 20 అర్జీలు, ధృవపత్రాల కోసం రెండు వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో సర్పంచులు కాల్తిరెడ్డి, రత్నమ్మ, ఆర్‌ఐ శ్రీకాంత్, సర్వేయర్ తారకరామారావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

వెంకటగిరి టౌన్, డిసెంబరు 20,(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బంగారుపేట అంగన్‌వాడీ కేంద్రం వద్ద శ్రీశ్రీనివాస సేవా ట్రస్టు (టీఏస్) ఆధ్వర్యంలో తిరుపతి అరవింద కంటి ఆసుపత్రి సౌజన్యంతో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 240మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి, 20మందిని ఆపరేషన్ ఎంపిక చేసినట్లు ట్రస్టు క్లస్టర్ ఇన్‌చార్జి జయసింగ్ తెలిపారు. వారిని తిరుపతికి తీసుకువెళ్లి ఆపరేషన్ చేయిస్తామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది అలేఖ్య, పార్థు, సతీష్, పలువురు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

కోట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామదేవత కోటమ్మ ఆలయంలో శుక్రవారం టీడీపీ మండల బీసీ సెల్ అధ్యక్షుడు చాపల శ్రీనివాసులు వితరణతో భక్తులకు అన్నదానం జరిగింది.

జగనన్న కాలనీలు మునిగిపోతున్నాయ్
మరో చోట ఇళ్ల స్థలాలు కేటాయించండి

- ఆర్డీవోకు వాటంబేడు గ్రామస్తుల మొర



వినతిపత్రాలు స్వీకరిస్తున్న ఆర్డీవో కిరణ్మాయి

తడ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం జగనన్న కాలనీల పేరుతో కేటాయించిన ఇళ్ల స్థలాలు వర్షం వస్తే మునిగిపోతున్నాయని, తమకు మరోచోట నివాస స్థలాలు ఇవ్వాలని సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయికి వాటంబేడు గ్రామస్తులు మొరపెట్టుకున్నారు. శుక్రవారం వాటంబేడు, కారిజాత గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరిగాయి. ఆర్డీవో కిరణ్మయి పాల్గొని అర్జీలు స్వీకరించారు. మొత్తం 30 వినతులు రాగా, ఇందులో భూముల సర్వే, ఇళ్ల స్థలాల మంజూరు కోసం అర్జీలు సమర్పించారు. తాము పొలాలకు వెళ్లే మార్గంలో గత ప్రభుత్వ హయాంలో అప్పటి నాయకులు సచివాలయం, ఆర్బీకే భవనాలను నిర్మించి దారిలేకుండా చేశారని, సమస్యకు పరిష్కారం చూపాలని వాటంబేడు గ్రామస్తులు కోరారు. సదస్సులో తహసీల్దారు శరత్‌బాబు, వివిధ శాఖల అధికారులు, టీడీపీ నాయకుడు బొమ్మన ఏకాంబరం పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు



సదస్సులో తహసీల్దార్ ద్వారకనాథరెడ్డి, సిద్దులయ్య నాయుడు, పీవీ కృష్ణారెడ్డి, సంచి కృష్ణయ్య, ప్రసాద్‌నాయుడు తదితరులు

పెళ్లకూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ ద్వారకనాథరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని నందిమాల గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఇప్పటి వరకు మండలంలో 14 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించగా 121 వినతులు వచ్చాయన్నారు. వాటిలో 18 అక్కడికక్కడే పరిష్కరించామని, మిగిలిన వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, సర్పంచు వెంకటయ్య, వీఆర్వోలు బూదనం రమేష్, వంశీకృష్ణ, నాయకులు దామెర ప్రసాద్‌నాయుడు, సిద్దులయ్య నాయుడు, పీవీ కృష్ణారెడ్డి, మదన్‌మోహన్ నాయుడు, మస్తాన్‌రెడ్డి పాల్గొన్నారు.

పింఛన్లు, రేషన్ కార్డుల కోసం అర్జీలు



మాటుమడుగులో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

దక్కిలి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాటుమడుగు గ్రామంలో శుక్రవారం తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రేషన్‌కార్డులు, పింఛన్లు మంజూరు చేయాలని కోరుతూ పలువురు అర్జీలు అందచేశారు. కొంతమంది తమకు సాగు భూములు ఇవ్వాలని కోరారు. మొత్తం 67 అర్జీలు వచ్చాయని, అన్నింటినీ పరిశీలించి త్వరలోనే పరిష్కరించడం జరుగుతుందని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయరు రాజగోపాల్, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటీశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి

కోట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, బాలకృష్ణ తెలిపారు. కోటలోని ప్రగతి విద్యాసంస్థల్లో శుక్రవారం విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ కానిస్టేబుళ్లు, ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ పసుపులేటి కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభలను జయప్రదం చేయండి

నాయుడుపేట టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘ నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో శుక్రవారం స్వర్ణోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. తిరుపతిలో ఈనెల 22, 23 తేదీల్లో జరగబోవు స్వర్ణోత్సవ మహాసభల్లో యూటీఎఫ్ నాయకులు, సభ్యులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రామమూర్తి, శేఖర్, సుబ్బారావు, గోవర్ధన్‌రెడ్డి, వాసు, శివ, శ్రీనివాసులు, నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి మండలాల యూటీఎఫ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

తడ(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఆదివారం జరిగే యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభలను జయప్రదం చేయాలని ఆ సంఘ అధ్యక్ష కార్యదర్శులు రాంబాబు, రవికుమార్ విజ్ఞప్తి చేశారు. స్వర్ణత్సవ సభల పోస్టర్లను ఆవిష్కరించారు.

మౌలిక వసతుల కల్పనలో వెనకాడొద్దు



నారాయణవనం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మౌలిక వసతులపై ఆరా తీస్తున్న జడ్పీటీసీ సభ్యుడు సుమన్

నారాయణవనం, డిసెంబర్ 20(ఆంధ్రజ్యోతి): భావితరాల విద్యార్థులకు విద్యాభ్యాసంలో, పాఠశాలలో మౌలిక వసతులు కల్పనలో వెనుకాడొద్దని నారాయణవనం జడ్పీటీసీ సభ్యుడు సుమన్ కుమార్ కోరారు. శుక్రవారం ఆయన నారాయణవనంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. వర్షం వస్తే పాఠశాల ప్రాంగణంలో నీరు నిల్వ లేకుండా చూడాలని అధికారులు కోరారు. తమకు ప్రత్యేక మరుగుదొడ్డి లేదంటూ విద్యార్థినులు సుమన్ దృష్టికి తీసుకురాగా, పంచాయతీ నిధులు రూ2,50,000లతో నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని కోరారు. అలాగే వంటశాలకు మరమ్మతులు చేయాలని చెప్పారు. డీవైఈవో ప్రభాకర్‌రాజు, ఎంపీడీవో శేఖర్‌రాజు, ఈవో షణ్ముగం, ప్రధానోపాధ్యాయురాలు సులోచన, టీడీపీ నాయకులు భాస్కరన్, హరి, పాఠశాల చైర్మన్ రాము, ఉపాధ్యాయులు ఉన్నారు.

వైభవంగా పద్మావతమ్మ ఊయల సేవ



నారాయణవనం, డిసెంబర్ 20(ఆంధ్రజ్యోతి): నారాయణవనంలో కొలువై ఉన్న కల్యాణ వెంకన్న ఆలయంలో పద్మావతి అమ్మవారి ఊయల సేవను శుక్రవారం వేడుకగా నిర్వహించారు. ఉదయం స్వామిఅమ్మవార్లకు శుక్రవారం సందర్భంగా నిత్య కైంకర్యాలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని నూతన పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి వేద పండితుల మంత్రోచ్ఛరణ నడుమ ఊంజల సేవను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ భట్టాచార్య,శ్రీనివాసరాఘవ భట్టాచార్య, ఆలయాధికారి నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తా: ఎమ్మెల్యే సుధీర్

రేణిగుంట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట రైల్వేస్టేషన్ అధునికీకరణకు ప్రణాళికలు సిద్ధమవుతున్నట్లు చెప్పారు. మండలంలోని అన్నాస్వామిపల్లెలో జరిగిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్న అనంతరం ఆయన మాట్లాడుతూ... రేణిగుంట పట్టణంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నిర్మాణ పనులను రూ.24కోట్లతో చేపట్టనున్నట్లు తెలిపారు. మంచినీళ్ల గుంటను సుందరీకరిస్తామన్నారు. అన్నాస్వామిపల్లె పరిసరాల్లో నకిలీ పట్టాలను రద్దు చేసి అర్హులైన వారికి కొత్త పట్టాలు మంజూరు చేయాలని ఈ గ్రామ కమిటీ టీడీపీ అధ్యక్షుడు నాదమునిరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి భాస్కర్‌రెడ్డి ఎమ్మెల్యేకు విన్నవించారు. అలాగే వాగువద్ద వంతెన నిర్మించాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ఈ మేరకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పెరటి కోళ్లతో అదనపు ఆదాయం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రిషితారెడ్డి, అధికారులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊరందూరు హరిజనవాడలో శుక్రవారం ఎస్వీ పశువైద్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఎస్సీ సబ్‌ప్లాన్ కింద భారత వ్యవసాయ పరిశోధన మండలి సహకారంతో రూ.4వేలు విలువైన వనరాజు జాతికి చెందిన పెరటి కోళ్లు, నీటిని సరఫరా చేసే పరికరం, మినరల్ మిక్చర్‌ను 30మంది రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి మాట్లాడుతూ... శాస్త్రవేత్తల పరిశోధన ఫలాలు రైతులకు చేరడం అభినందనీయమన్నారు. పెరటికోళ్లతో కుటుంబానికి అదనపు ఆదాయం లభిస్తుందన్నారు. పశు వైద్యకళాశాల అసోసియేట్ డీన్ జగపతిరామయ్య, ప్రొఫెసర్ రాంబాబునాయక్, శ్రీకాళహస్తి పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు ఎస్.వి.శ్రీకాంత్‌బాబు, ఊరందూరు డాక్టర్ ఊహ తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా క్షమాపణ చెప్పాలి



సత్యవేడులో నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు

సత్యవేడు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా భారత జాతికి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని దళిత సంఘం నాయకులు డిమాండ్ చేశారు. అమిత్‌షా వ్యాఖ్యలపై పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అత్యుత్తమ రాజ్యాంగాన్ని అందించిన అంబేడ్కర్‌ను చులకన చేస్తూ మా ట్లాడిన అమిత్‌షా తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని కోరారు. వెంకటరమణ, ఎంపీ రవి, అడ్వకేట్ రాజా, గోవిందస్వామి, అరుళ్ సెల్వం, జోసెఫ్, మాణిక్యం, సన్యాసయ్య తదితరులు పాల్గొన్నారు.
వరదయ్యపాళెం: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానిస్తూ మాట్లాడటం సరికాదని వరదయ్యపాళెం మాజీ సర్పంచు చిన్న అన్నారు. శుక్రవారం వరదయ్యపాళెంలో నిరసన చేపట్టారు. అమిత్‌షా వెంటనే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రామసుబ్బయ్య, గంగాధర్, డేవిడ్, జగన్నాథం, అరునాథ్, వెంకటకృష్ణయ్య, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

- టీడీపీ నేత హేమాక్షి చొరవ...

టిడ్కో ఇళ్ల వద్ద పిచ్చిమొక్కల తొలగింపు



ఏర్పేడు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని వికృతమాల వద్ద టిడ్కో ఇళ్ల సముదాయంలో టీడీపీ నేత ఆధ్వర్యంలో పిచ్చి మొక్కలను తొలగించారు. 2019కి ముందు టీడీపీ హయాంలో ఇక్కడి 1,600 మందికి టిడ్కో ఇళ్లను నిర్మించి ఇచ్చారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభత్వం ఇక్కడి సముదాయంలో మౌలిక వసతులు కల్పించకపోగా పారిశుధ్య నిర్వహణను గాలికొదిలేసింది. దీంతో ఇళ్ల మధ్య పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి అడవిని తలిపిస్తోంది. దీనిపై స్థానికులు టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచు హేమాక్షి రాయల్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి ఎక్స్‌కవేటర్ సాయంతో మొక్కలను తొలగించారు. ఎమ్మెల్యే సుధీర్ దృష్టికి తీసుకెళ్లి మౌలిక వసతులు కల్పిస్తానని చెప్పారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి



ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

నాగలాపురం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు తప్పని సరిగా ధరించాలని నాగలాపురం ఎస్ఐ సునీల్ తెలిపారు. శుక్రవారం ఎస్ఐ సిబ్బందితో నాగలాపురం, సురుటుపల్లెల్లో ద్విచక్ర వాహన తనిఖీలు నిర్వహించారు. రికార్డులు లేని పలు వాహ నాలకు, హెల్మెట్ ధరించని వారికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. హెల్మెట్ లేని ప్రయాణం అత్యంత ప్రమాదకరమని

అన్నదాత మహోత్సవం



రైతును సత్కరిస్తున్న బ్యాంకు అధికారులు

పిచ్చాటూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్టేట్‌బ్యాంకు ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదాత మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు రీజనల్ అధికారులు రైతులకు, చిరువ్యాపారులకు కల్పిస్తున్న రుణ సదుపాయాలను వివరించారు. అలాగే వ్యవసాయానికి సంబంధించి కేసీసీఆర్, ఏపీఈఎల్, పీఎంఎఫ్ఎంఈ, స్వయం సిద్ధ లాంటి రుణాలపై అవగాహన కల్పించారు. అనంతరం రైతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారులు గురుశీల, శ్రీహరిప్రసాద్, పిచ్చాటూరు బ్రాంచి మేనేజర్ బి.అంజాద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గణిత దినం

శ్రీకాళహస్తి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): గణితశాస్త్రంలో ప్రావీణ్యం పొందితేనే విద్యార్థులకు భవిష్యత్తు ఉంటుందని ఎస్వీయే ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహవర్మ అన్నారు. శుక్రవారం జాతీయ గణిత దినం సందర్భంగా గణిత మేధావి రామానుజన్ ప్రతిపాదించిన సిద్ధాంతాలు, ప్రాముఖ్యతను వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ గంగారామ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

దుస్థితిలో అంగన్‌వాడీ భవనం

- ప్రాథమిక పాఠశాల పంచన చిన్నారులు
- పట్టించుకోని అధికారులు



కూలే దశలో ఉన్న అంగన్‌వాడీ భవనం - పెచ్చులూడిన స్లాబ్ - ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటున్న చిన్నారులు

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నాయగుంటలో ఉన్న అంగన్‌వాడీ భవనం దుస్థితికి చేరుకుంది. పాఠశాల పక్కనే పాత భవనం ఉండడంతో ఈ భవనంలో అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేశారు. సంవత్సరం క్రితం ఈ భవనం స్లాబ్ పెచ్చులూడి కూలే దశకు చేరుకోవడంతో పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాలలో అంగన్‌వాడీ కేంద్రాన్ని మార్చారు. అంగన్‌వాడీకి కొత్త భవనం మంజూరు చేయాలని పలుమార్లు అధికారులకు తెలిపినా పట్టించుకోలేదని గ్రామస్తులు చెప్పారు. సంబంధిత అధికారులు స్పందించాల్సి ఉంది.

ప్రతి అర్జీ పరిష్కరిస్తాం: ఆదిమూలం



అర్జీదారుల వివరాలను నమోదు చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులో భూ సమస్యల పరిష్కారం కోసం అందించిన ప్రతి అర్జీనీ పరిష్కరిస్తామని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం భరోసా ఇచ్చారు. శుక్రవారం మండలంలోని రామగిరి, అడవి కండ్రిగ గ్రామాలకు సంబంధించి అంకాళపరమేశ్వరి కల్యాణ సదన్‌లో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో కబ్జాకు గురైన భూములు, ప్రభుత్వ భూములు, ఇతర సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. రామగిరి, శివగిరి, నీరువాయిల్లో శ్మశాన స్థలాల సమస్యలను పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను కోరారు. నోషన్ ఖాతాలు, ఆన్‌లైన్ సమస్యలపై వినతిప్రతాలు అందించారు. కార్యక్రమంలో సర్పంచు సతీష్, ఏఎంసీ మాజీ చైర్మన్, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు సుమాంజలి, తహసీల్దార్ రమేష్‌బాబు, ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఆర్ఐ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.
సత్యవేడు: మండలంలోని చిన్నఈటిపాకంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఎనిమిది అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ టీవీ సుబ్రమణ్యం తెలిపారు. సర్వే నెంబర్ల మార్పులు, సరిహద్దు గుర్తింపులు, చుక్కల భూముల సమస్యలు తదితరాలను పరిష్కరించాలని వినతులు సమర్పించినట్టు తెలిపారు. పాలగుంట దళితవాడలో సర్వే నెం.90లోని నాలుగు ఎకరాల శ్మశాన స్థలం ఇతరుల పేర్లమీద పట్టాలిచ్చారని, రద్దు చేయాలని వినతిపత్రం అందించారు. అదే విధంగా సర్వే నెం.304/2, 3, 4లోని ప్రభుత్వ భూమిని ఆక్రమణదారుల నుంచి రక్షించాలని కోరారు. గతంలో ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇంటి పట్టాలపై సమగ్ర విచారణ జరపాలని, పాలగుంట శివాలయానికి దారి వసతి కల్పించాలని వినతులు అందించారు. మాజీ ఎంపీపీ మస్తాన్, సర్పంచు గోవిందస్వామి, ఆర్ఐ సురేష్, వీఆర్వోలు రమేష్, వినోద్, సెక్రటరీ జలజశ్రీ పాల్గొన్నారు.
కేవీబీపురం: భూములకు సంబంధించి ఎలాంటి సమస్య ఉన్నా రెవెన్యూ సదస్సులో పరిష్కరించుకోవచ్చని తహసీల్దారు మునిరత్నంరెడ్డి చెప్పారు. శుక్రవారం మండలంలోని కండ్లూరు, ఆదరం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. సదస్సుల్లో ఎక్కువగా మ్యూటేషన్లకు సంబంధించి అర్జీలు వచ్చాయని చెప్పారు.
బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పెద్దపాలేడులో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో 15అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ సుబ్రమణ్యం తెలిపారు.
వరదయ్యపాళెం: ప్రతి అర్జీని నిర్ణీత గడువు లోపు పరిష్కరిస్తామని తహసీల్దారు రాజశేఖర్ అన్నారు. మండలంలోని పాండూరులో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ... పాండూరు రెవెన్యూలో ప్రధానంగా జీరో ఖాతాలో భూమి ఉన్న వారు ఎక్కువగా ఉన్నందున ఆర్డీవో, జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామన్నారు. అదే విధంగా పాండూరు కొత్తదళితవాడ శ్మశాన దారి వివాదంపై సర్వే చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచు కవిత కృష్ణయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి, నాయకులు నాగ రాజు, అధికారులు రెడ్డెప్ప వెంకటరమణ, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ వినియోగదారుల దినోత్సవం

శ్రీకాళహస్తి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలం గుండేలిగుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించారు. వస్తువు కొనే సమయంలో నాణ్యత, తయారుచేసిన తేదీ, గడువు ముగింపు తేది చూసి కొనుగోలు చేయాలని ప్రధానోపాధ్యాయుడు ముని తిరుమలయ్య చెప్పారు. ఎవరైనా మోసాలకు పాల్పడితే వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించ వచ్చన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇమాం, మౌజన్లకు గౌరవవేతనం అభినందనీయం

శ్రీకాళహస్తి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 5వేలు ఆదాయం లేని మసీదుల ఇమాంలు, మౌజన్లకు గౌరవవేతనం ప్రకటించడం అభినందనీయమని టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి షాకీరాలీ అన్నారు. సీఎం చంద్రబాబు, మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్‌కు ధన్యవాదాలు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం మైనార్టీలను గాలికి వదిలేసిందన్నారు.

హాట్‌బాక్స్ వితరణ

ఏర్పేడు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని గడిమల్లం పరశురామేశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి గుత్తివారిపల్లెకు చెందిన శ్రీనివాసులు దంపతులు 40 లీటర్ల హాట్‌బాక్సు అందజేశారు. దీన్ని ఆలయ అధికారులు స్వీకరించారు. వారికి స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ మాజీ చైర్మన్ గిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయండి

శ్రీకాళహస్తి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివయ్య, భక్తకన్నప్ప సర్కిళ్లలో హైమాస్ట్ లైటింగ్ ఏర్పాటు చేయాలని శ్రీ కాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు కోరారు. దక్షిణ కైలాస క్షేత్రానికి ఆధ్యాత్మిక శోభ సంతరించుకునేలా పట్టణంలోని కాసాగార్డెన్ వద్ద నంది సర్కిల్, చెన్నై నుంచి పట్టణంలోకి వచ్చే రహదారిలో భక్తకన్నప్ప సర్కిల్, ఏపీ సీడ్స్ వద్ద శివయ్య సర్కిల్ వద్ద గత ప్రభుత్వ హయాంలో హైమాస్ట్ లైటింగ్ కోసం ఏర్పాట్లు చేశామని ఎన్నికల కోడ్ రావడంతో పనులు ఆగిపోయాయన్నారు. మరో రెండు నెలల్లో శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ సర్కిళ్ల వద్ద హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని ముక్కంటి ఆలయ ఈవో చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రాథమిక దశలో గుర్తిస్తే క్యాన్సర్‌ను నయం చేయవచ్చు

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక దశలో క్యాన్సర్‌ను నయం చేయవచ్చని ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి విద్యాసాగర్ తెలిపారు. మండలంలోని వేణుగోపాలపురం, తలారివెట్టుల్లో స్విమ్స్, శ్రీబాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ ఆధ్వర్యంలో పింక్ బస్సుల్లో నోరు, రొమ్ము, గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటేశ్వరు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కన్నయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా టీడీపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు చేయిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదును సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సుధీర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని 22వ వార్డు పరిధిలో శుక్రవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. టీడీపీ సభ్యత్వ నమోదు ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెంచయ్యనాయుడు, నాయకులు లక్ష్మనేని మధు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు వరం అరణియార్

పిచ్చాటూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): అరణియార్ ప్రాజెక్టు రైతులకు, మత్స్యకారులకు వరమని ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. శుక్రవారం పిచ్చాటూరు టీడీపీ కార్యాలయంలో అభివృద్ధి పనులను ఆయన వివరించారు. నియోజకవర్గంలో గత ఆరు నెలల్లో రూ.20 కోట్లతో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయన్నారు. అలాగే వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, వంతెనలు మరమ్మతులు చేయిస్తామన్నారు. జైకా నిధులు రూ.36 కోట్లతో అరణియార్‌ను ఆధునీకరిస్తున్నామన్నారు. అలాగే టీడీపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. శంకరాపురం చెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడు పద్దురాజు, నాయకులు రవిరెడ్డి, శ్రీనివాసులు, వాసురెడ్డి, ఎం.ఎస్.రవి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ చొరవతో ప్రమాదాల నివారణకు చర్యలు



కోతకు గురైన రోడ్డు వద్ద రాళ్లు ఏర్పాటు చేస్తున్న యువకులు

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తడ- శ్రీకాళహస్తి రోడ్డు ఎన్టీఆర్‌నగర్ సమీపంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు కోతకు గురై పెద్ద గుంట ఏర్పడింది. ఈ విషయాన్ని గమనించిన ఎస్ఐ విశ్వనాథనాయుడు చర్యలకు ఉపక్రమించారు. గ్రామయువతతో కలిసి చర్యలు చేపట్టారు. ఎన్టీఆర్ నగర్ సమీపంలో తారు రోడ్డు 150 మీటర్లు వరకు కోసుకుపోయింది. ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. రాత్రి వేళ్లలో రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా రాళ్లను అడ్డుపెట్టారు. ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సాదర వీడ్కోలు



రేణిగుంట, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్‌కు జిల్లా అధికార యంత్రాంగం సాదర వీడ్కోలు పలికింది. తిరుమల దర్శనానంతరం తిరుగు ప్రయాణమైన ఆయన్ను తిరుపతి విమానాశ్రయంలో కలెక్టర్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా, ఆర్డీవో భాను ప్రకాష్‌రెడ్డి, తహసీల్దారు సురేష్‌బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎస్‌ను సత్కరించి జ్ఞాపికను బహూకరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

శ్రీకాళహస్తి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తిరుపతి రూరల్ ఈఈ వాసురెడ్డి తెలిపారు. 132కేవీ సబ్‌స్టేషన్లలో ఏర్పడిన సాంకేతిక సమస్య వలన ఉదయం 9 నుంచి 1 గంటల వరకు శ్రీకాళహస్తి పట్టణం, మండలం, తొట్టంబేడు, బీఎన్‌కండ్రిగ, ఏర్పేడు, కేవీబీపురం మండలాల పరిధిలో విద్యుత్ అంతారయం ఏర్పడుతుందన్నారు.

రేణిగుంటలో...

రేణిగుంట మండల పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో డీఈ రమేష్‌బాబు తెలిపారు. తూకివాకం, కరకంబాడి, గురవరాజుపల్లి, కుర్రకాలువల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ఈ రోడ్డుపై నడిచేదెలా?



ఛిద్రమైన మర్రిగుంట-పెరిందేశం రోడ్డు

కేవీబీపురం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగిగుంట నుంచి మర్రిగుంట, పెరిందేశం గ్రామాలకు వెళ్లే రోడ్డు ఇటీవల వర్షాలకు బురదమయమైంది. కనీసం కాలినడకన గ్రామాలకు చేరుకోలేకపోతున్నట్లు గ్రామీణులు వాపోతున్నారు. ఈ రోడ్డు మీదుగా మర్రిగుంట, పెరిందేశం గ్రామాల విద్యార్థులు రాగిగుంటలోని ఉన్నత పాఠశాలలో చదువును అభ్యసిస్తున్నారు. వీరి రాకపోకలకు చాలా ఇబ్బందికరంగా మారింది. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాల్సి ఉంది.

పాఠకులకు ముఖ్యగమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మింపబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి